ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
తూర్పుగోదావరి
జిల్లా వార్తలు
గురువారం 1 ఫిబ్రవరి 2024 | 5



‘ఆంధ్రజ్యోతి’ చొరవతో వృద్ధుడికి వైద్యం
7లో
నిర్లక్ష్యం వహించిన వైద్యులపై కలెక్టర్ సీరియస్

ఉన్నత విద్యలో మరింత పురోగతి దిశగా..

నన్నయ యూనివర్సిటీ స్నాతకోత్సవంలో గవర్నర్ అబ్దుల్‌నజీర్



నన్నయ విశ్వవిద్యాలయ అధికారులతో గవర్నర్ అబ్దుల్‌నజీర్



స్నాతకోత్సవానికి హాజరైన గవర్నర్, ఇతర ముఖ్య అతిథులు

దివాన్‌చెరువు/రాజానగరం, జనవరి 31 : ఉన్నత విద్యలో 2035 నాటికి స్థూల నమోదు నిష్పత్తిని 50 శాతం పెంచడమే జాతీయ విద్యా విధానం-2020 లక్ష్యమని రాష్ట్ర గవర్నర్, నన్నయ విశ్వ విద్యాలయ కులపతి ఎస్.అబ్దుల్ నజీర్ అన్నారు. ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం 13,14,15 ఉమ్మడి స్నాతకోత్సవం బుధవారం వర్సిటీలోని ఎన్టీఆర్ కన్వెన్షన్ భవనంలో బుధవారం జరిగింది. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన గవర్నర్ మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా 900 విశ్వ విద్యాలయాలు, 40 వేల కళాశాలలతో ఉన్నత విద్యావిధానంలో భారతదేశం అతిపెద్ద నెట్‌వర్క్ కలిగి ఉందన్నారు. కానీ ఉన్నత విద్య స్థూల నిష్పత్తిలో మన దేశం కేవలం 27.29 శాతం మాత్రమే ఉందన్నారు. రానున్న 15 ఏళ్లలో ఉన్నత విద్యలో అరుదైన భాగస్వామ్యాన్ని రెట్టింపు చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వాలు ముందుకెళుతున్నాయన్నారు. జాతీయ విద్యా విధానానికి అనుగుణంగా సంపూర్ణ విద్యను మన రాష్ట్రం కూడా ప్రవేశపెట్టిందని చెప్పారు. నేడు ప్రపంచం వాతావరణ మార్పులతో తీవ్రమైన ముప్పును ఎదుర్కొంటుందని చెప్పారు. పర్యావరణ కాలుష్యం అనూహ్య వాతావరణ మార్పులకు దారితీస్తోందన్నారు. భూమి ప్రతి మనిషి అవసరాలను తీరుస్తుందని కాని వారి దురాశలను కాదని పూజ్య బాపూజీ చెప్పిన సూక్తిని గవర్నర్ వివరించారు. విద్యావంతులైన గ్రాడ్యుయేట్లు, యువకులతో 2047 నాటికి భారతదేశం స్థిరమైన అభివృద్ధిని సాధించే దిశగా పయనింపచేయాలన్నారు. మన దేశం స్వాతంత్ర్య శతాబ్ది ఉత్సవాలను జరుపుకోనున్న 2047 నాటికి సమాజంలోని అన్ని అసమానతలను రూపుమాపాలన్నారు. ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం నుంచి పట్టాలు పొందిన విద్యార్థులు దేశ గొప్ప సంప్రదాయాలను నిలబెట్టే దిశగా కృషి చేస్తారని, చదువుకున్న విశ్వవిద్యాలయానికి సమాజంలో కీర్తిప్రతిష్టలు తీసుకొస్తారని విశ్వసిస్తున్నానన్నారు. నన్నయ ఉపకులపతి ఆచార్య కె.పద్మరాజు, రాష్ట్ర ఉన్నత విద్యామండలి ఛైర్మన్ ఆచార్య కె.హేమచంద్రారెడ్డి, రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్, విశ్వవిద్యాలయ అధికారులు పి.సురేష్‌వర్మ, వై.శ్రీనివాసరావు, కె.శ్రీరమేష్, ఎమ్మెల్యే జక్కంపూడి రాజా, రాష్ట్ర గృహ నిర్మాణ సంస్థ ఛైర్‌పర్సన్ మేడపాటి షర్మిళారెడ్డి, చైతన్య విద్యాసంస్థల ఛైర్మన్ కేవీవీ సత్యనారాయణరాజు(చైతన్యరాజు), ఆదిత్య విద్యాసంస్థల ఛైర్మన్ ఎన్.శేషారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రాష్ట్ర గవర్నర్ అబ్దుల్‌నజీర్

సంస్కృతిని పరిరక్షించాలి
ఇన్ఫోసిస్ ఛైర్‌పర్సన్ సుధామూర్తి

స్నాతకోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరైన ఇన్ఫోసిస్ ఛైర్‌పర్సన్ సుధామూర్తి మాట్లాడుతూ మాతృభాషను తప్పక గౌరవించాలని, అలాగే సంస్కృతి, సంప్రదాయాలను పరిరక్షించాలన్నారు. ఇతరుల దయాగుణం కలిగి ఉండాలని, ఆపదలో ఉన్న వారిని ఆదుకోవాలని చెప్పారు. మాతృదేవోభవ, పితృదేవోభవ, ఆచార్యదేవోభవ, అతిథి దేవోభవ అనే సూక్తిని విద్యార్థులంతా ఆచరించాలన్నారు. అలాగే ఉపనిషత్తులు, విష్ణు పురాణాల్లోని నీతి ధర్మాలను వివరించారు. విశ్వంలో ప్రతీ జీవరాశి పట్ల దయ, ప్రేమ కలిగి ఉండాలని కోరారు.



నైనాజైస్వాల్‌కు పీహెచ్‌డీ ప్రదానం

వీసీ పద్మరాజు

గవర్నర్‌కు సత్కారం

విద్యార్థికి పట్టా అందిస్తున్న గవర్నర్

పట్టాలు ప్రదానం

దివాన్‌చెరువు/రాజానగరం, జనవరి 31: ఆదికవి నన్నయ విశ్వ విద్యాలయం 13,14,15 ఉమ్మడి స్నాతకోత్సవం సందర్భంగా ఇన్ఫోసిస్ ఛైర్‌పర్సన్ సుధామూర్తికి గౌరవ డాక్టరేట్‌ను, రాష్ట్ర తెలుగు సంస్కృత అకాడమీ ఛైర్‌పర్సన్ నందమూరి లక్ష్మీ పార్వతికి డి.లిట్‌ను, ఎంఏ సోషల్ వర్క్‌లో జక్కంపూడి రామ్మోహనరావు ఫౌండేషన్ ఎండోమెంట్ గోల్డ్ మెడల్‌ను 2021కి గానూ జక్కంపూడి విజయలక్ష్మికి రాష్ట్ర గవర్నర్, కులపతి ఎస్.అబ్దుల్ నజీర్ ప్రదానం చేశారు. అలాగే టేబుల్ టెన్నిస్ క్రీడాకారిణి నైనా జైస్వాల్‌కు గవర్నర్ మేనేజ్‌మెంట్ స్టడీస్‌లో పీహెచ్‌డీ ప్రదానం చేశారు. విశ్వవిద్యాలయంలోని ఎన్టీఆర్ కన్వెన్షన్ సెంటర్‌లో బుధవారం జరిగిన స్నాత కోత్సవంలో దరఖాస్తు చేసుకున్న 500 మందిలో పీహెచ్‌డీ 12, బంగారు పతకాలు 12, ప్రైజులు 12 అందజేశారు. మిగిలిన వారిలో ఎంఏ, ఎంకామ్, ఎంబీఏ, ఎల్ఎల్ఎం, ఎమ్మెస్సీ, ఎంసీఏ, ఎంఈడీ, ఎల్ఎల్‌బీ, బీఈడీ వంటి కోర్సులు పూర్తిచేసిన వారికి సర్టిఫికెట్లు అందజేశారు. మూడు విద్యా సంవత్సరాల్లో విశ్వవిద్యాలయం, అనుబంధ కళాశాలల్లో పీజీ పూర్తి చేసిన 8582 మంది, అండర్ గ్రాడ్యుయేషన్ పూర్తి చేసిన 50,173 మంది విద్యార్థులకు పట్టాలు ఆమోదించారు. ఆర్థిక శాఖ సంయుక్త సలహాదారు డి.సురేంద్ర, రాష్ట్ర తెలుగు సంస్కృత అకాడమీ ఛైర్‌పర్సన్ నందమూరి లక్ష్మీపార్వతి, ఈసీ సభ్యులు పి.విజయనిర్మల, కె.నూకరత్నం, జ్యోతి, ఎం.వసంతలక్ష్మి, షేక్ సులేమాన్, జి.నారాయణరావు, జి.రాజకుమార్, వై.సత్యనారాయణ, డీన్లు కెఎస్ రమేష్, పి.సురేష్‌వర్మ, వై.శ్రీనివాసరావు, కె.రమణేశ్వరి, ఎ.మట్టారెడ్డి, ప్రిన్సిపాల్స్ డి.జ్యోతిర్మయి, పి.వెంకటేశ్వరరావు, కె.సుబ్బారావు, ఎస్.ప్రశాంతిశ్రీ, టి.అశోక్, డైరెక్టర్ వి.పెర్సిస్, సీఈ ఎస్.లింగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రజల అభివృద్ధితోనే.. దేశాభివృద్ధి

- రాష్ట్ర గవర్నర్, జేఎన్‌టీయూకే కులపతి ఎస్.అబ్దుల్ నజీర్
- ఘనంగా కాకినాడ జేఎన్టీయూకే పదో స్నాతకోత్సవం
- ముఖ్యఅతిథిగా మాజీ నేవీ రియర్ అడ్మిరల్ వెంకటశేషాచారి
- టీసీఎస్ ప్రెసిడెంట్ వి.రాజన్నకు గౌరవ డాక్టరేట్ ప్రదానం
- 64 పీహెచ్‌డీ అవార్డులు, 28 బంగారు పతకాలు ప్రదానం



జేఎన్‌టీయూకే స్నాతకోత్సవంలో మాట్లాడుతున్న రాష్ట్ర గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్



వి.రాజన్నకు గౌరవ డాక్టరేట్‌ను ప్రదానం చేస్తున్న గవర్నర్ అబ్దుల్‌నజీర్

జేఎన్టీయూకే, జనవరి 31: ప్రజల అభివృద్ధితోనే దేశం అభివృద్ధి చెందుతుందని రాష్ట్ర గవర్నర్, జేఎన్‌టీయూకే కులపతి ఎస్.అబ్దుల్ నజీర్ అన్నారు. వర్సిటీలోని అలూమ్ని ఆడిటోరియంలో కాకినాడ జేఎన్టీయూకే పదో స్నాతకోత్సవాన్ని బుధవారం ఉదయం 11గంటలకు గవర్నర్ అధ్యక్షతన ప్రారంభించారు. ఈ వేడుకలకు మాజీ నేవీ రియర్ అడ్మిరల్ ఎస్.వెంకటశేషాచారి ముఖ్యఅతిథిగా విచ్చేయగా టీసీఎస్ టెక్నాలజీ, సాఫ్ట్‌వేర్ సర్వీసెస్ ప్రెసిడెంట్ వి.రాజన్నకు గౌరవ డాక్టరేట్‌ను ప్రదానం చేశారు. జేఎన్టీయూకే ఉపకులపతి జీవీఆర్ ప్రసాదరాజు, ఏపీఎస్సీహెచ్‌ఈ ఛైర్మన్ కె.హేమచంద్రారెడ్డి, డైరెక్టర్లు, ఈసీ సభ్యులు, ప్రిన్సిపాల్స్ వేదికను అలంకరించారు. ఈ కార్యక్రమానికి అతిథులు, పీహెచ్‌డీ అవార్డు గ్రహీతలు, బంగారు పతక విజేతలు స్నాతకోత్సవ సంప్రదాయ వస్త్రధారణలో విచ్చేశారు.



మాట్లాడుతున్న ఎస్.వెంకటశేషాచారి



మాట్లాడుతున్న ఉపకులపతి ప్రసాదరాజు





గవర్నర్ నుంచి పీహెచ్‌డీ అందుకుంటున్న ఎం.జయ, బంగారు పతకం అందుకుంటున్న ఎన్ఎస్ఏ శ్రీసాగరి

గవర్నర్ అబ్దుల్‌నజీర్ మాట్లాడుతూ పీహెచ్‌డీ అవార్డు గ్రహీతలు, బంగారు పతకాలు సాధించిన విద్యార్థులను ప్రత్యేకంగా అభినందించారు. జేఎన్టీయూకే న్యాక్ఏ+ గ్రేడ్, యూసీఈకే ఎన్‌బీఏ గుర్తింపు సాధించినందుకు వర్సిటీ అధికారులను ప్రశంసించారు. స్వామి వివేకానంద మాటలను గుర్తుచేశారు. ఒక ఆలోచనను స్వీకరించి దాన్ని తమ జీవితంగా చేసుకోవాల ని దాని గూర్చే ఎల్లప్పుడూ ఆలోచిస్తూ కలలు కంటూ లక్ష్యాన్ని సాధించాలన్నారు. తమను తాము విశ్వసించాలని, తమ జ్ఞానం సామర్థ్యాలపై అత్యంత విశ్వాసం చూపాలని సూచించారు. ఉన్నతవిద్య విద్యార్థులకు నైతిక, రాజ్యాంగ విలువలు, కళలు, ఉత్సుకత, సాంకేతికత అధ్యయనం చేసేలా రూపొందించాలని కోరారు. వృత్తిపరంగా ప్రతిఒక్కరూ సమాజంకోసం కృషిచేయాలన్నారు. ఒక వ్యక్తి వ్యక్తిత్వాన్ని రూపుదిద్దడంలో విద్యాసంస్థల బాధ్యత ఎంతో ఉందన్నారు. అనంతరం ముఖ్యఅతిథి వెంకటశేషాచారి మాట్లాడుతూ విద్యార్థుల విజ్ఞానా న్ని పెంపొందించే పరిశ్రమలకోసం పరిశోధనాభివృద్ధి ప్రాజెక్టుల ను ప్రోత్సహించాలని కోరారు. దక్షిణ చైనా సముద్రంలోని పరిస్థితులు, రష్యా-ఉక్రెయిన్ల వివాదం, ఇజ్రాయిల్-హమాస్‌ల వివా దం కొనసాగే అవకాశం ఉన్నందున మన దేశ తయారీ రంగంలో అత్యాధునిక సాంకేతికతను తీసుకురావడానికి ఇది గొప్ప అవకాశమన్నారు. యువకులు పరిశోధన, అభివృద్ధి సహాయంతో యుద్ధనౌకల రూపకల్పనలో ముఖ్యభూమిక పోషించాలని కోరారు. వీసీ ప్రసాదరాజు మాట్లాడుతూ ఎన్ఈపీ 2020 ప్రకారం ఆర్23 సిలబస్‌ను రూపకల్ప న చేశామన్నారు. వర్సిటీ క్రీడా విభాగానికి కేంద్రం 400మీటర్ల సింథటిక్ అ థ్లెటిక్ ట్రాక్‌ను మంజూరు చేసిందని తెలిపారు. వర్సిటీ పరిధిలోని 22ఇంజనీ రింగ్, ఫార్మసీ కళాశాలలు 2023-24నుంచి స్వయంప్రతిపత్తి పొందాయన్నారు. విశ్వవిద్యాలయం సైన్స్, టెక్నాలజీ, ఇంజనీరింగ్, గణిత విభాగాల్లో విద్యను ప్రో త్సహించేందుకు వినూత్న కోర్సులందించే చర్యలు చేపడుతున్నామన్నారు.



గవర్నర్‌తో కలిసి స్నాతకోత్సవంలో పాల్గొన్న అతిథులు

అవార్డులు, పతకాలు ప్రదానం

స్నాతకోత్సవంలో 64మందికి పీహెచ్‌డీ అవార్డులు, 21మందికి బంగారు పతకాలను గవర్నర్, వీసీ ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఈసీ సభ్యులు, రెక్టార్ కేవీ రమణ, రిజిస్ట్రార్ సుమలత, మాజీ వీసీలు తులసీరామ్‌దాస్, కుమార్, శ్రీనివాస్‌కుమార్, మాజీ ఏపీపీఎస్సీ ఛైర్మన్ ఉదయ్‌భాస్కర్, శేషారెడ్డి, కృష్ణారావు, చైతన్యరాజు, ఈసీ సభ్యులు ఎస్.చంద్రశేఖర్, బీవీవీ సత్యనారాయణ, అమీనాబి, సతీష్‌రెడ్డి, డైరెక్టర్లు సీహెచ్‌సాయిబాబు, వి.రవీంద్ర, బి.బాలకృష్ణ, ఏ.గోపాలకృష్ణ, బీటీకృష్ణ, మురళీకృష్ణ, శ్రీనివాసులు, కృష్ణమోహన్ బాలాజీ, ప్రిన్సిపాల్ కృష్ణప్రసాద్, రత్నకుమారి, హరిత, పీహెచ్‌డీ గ్రహీతలు, విద్యార్థులు పాల్గొన్నారు. సాయంత్రం విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.



సాంస్కృతిక ప్రదర్శనలు ఇస్తున్న విద్యార్థినులు

రాజమహేంద్రవరం కార్పొరేషన్ ఎన్నికలు జరిపించలేని స్థితిలో వైసీపీ ప్రభుత్వం

- ఓటమి భయంతోనే ఎన్నికలకు దూరం
- ఎంపీ భరత్ చేసిందేమీ లేదు
- ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి



రాజమహేంద్రవరం, జనవరి 31(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికలు జరిపించలేని దారుణ స్థితిలో వైసీపీ ఉందని, ఓటమి భయంతోనే ఎన్నికలు నిర్వహించలేదని టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు, రాజమహేంద్రవరం రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి ధ్వజమెత్తారు. స్థానికంగా తన స్వగృహంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. సర్పంచులు, జడ్పీటీసీలు చనిపోయిన స్థానాల్లో కూడా ఎన్నికలు పెట్టడానికి వైసీపీకి ఓటమి భయం పట్టుకుందన్నారు. తెలుగుదేశం సభ విజయవంతం కావడంతో బాకా బాబు అయిన ఎంపీ భరత్ ఉలికిపడిపోతున్నారని, గుడిని, గుడిలో లింగాన్ని కూడా మింగేస్తున్నారని ఆరోపించారు. రాజమహేంద్ర వరానికి తానే సృష్టి కర్త అనే విధంగా బాకా ఊదేస్తున్నారని, బావిలో కప్ప తనకు అదే ప్రపంచం అనుకుంటుందని ఎద్దేవా చేశారు. ఎన్నో కబుర్లు చెప్పారని, రింగ్‌రోడ్డని, స్టేడియం అని అని అన్నారు. ఎంపీ మురళీ మోహన్ 5 ఫ్లైఓవర్ బ్రిడ్జిలు శాంక్షన్ చేయిస్తే, వాటిని రద్దు చేయించి, ఒకటి కడుతున్నారని అదైనా ఎప్పటికి పూర్తవుతుందో తెలియదని ఎద్దేవా చేశారు. ఆవ భూముల కుంభకోణం జరిగిందని, ఒక పట్టా కూడా ఇవ్వలేదని ఆయన విమర్శించారు. అసలు వైసీపీ ప్రభుత్వం నుంచి రాజమహేంద్రవరం అభివృద్ధికి నిధులెన్ని తెచ్చావో శ్వేతపత్రం ప్రకటించాలని ఆయన ఎంపీని డిమాండ్ చేశారు. రామచంద్రపురంలో చెల్లని మంత్రి, రాజ మహేంద్రవరం రూరల్‌లో ఎలా చెల్లిపోతారని ఆయన ఎద్దేవా చేశారు.

ఎంపీ భరత్ పెర్ఫార్మెన్స్ అందరికీ తెలుసు

టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ ఆదిరెడ్డి వాసు



సమావేశంలో మాట్లాడుతున్న ఆదిరెడ్డి వాసు

రాజమహేంద్రవరం సిటీ, జనవరి 31: రీల్ స్టార్ ఎంపీ భరత్ పెర్ఫార్మెన్స్ ఏమిటో పార్లమెంట్‌లో అందరికీ తెలుసని టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ ఆదిరెడ్డి వాసు అన్నారు. రాజమహేంద్రవరం ప్రెస్‌క్లబ్‌లో బుధవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పార్లమెంట్‌లో తాను ఎక్కువ శాతం డిబేట్‌లో పాల్గొనలేదని నిరూపిస్తే రాజీనామా చేస్తామని చెప్పిన భరత్ చిట్టా తన వద్ద ఉందని, అతను ఎపుడు రాజీనామా చేస్తాడో చెప్పాలని ఆదిరెడ్డి వాసు ప్రశ్నించారు. పార్లమెంట్‌లో తాను మాత్రమే మాట్లాడుతున్నానని రాష్ట్రావసరాలను తానే లేవనెత్తుతున్నానని, తాను కష్టపడిన దానిలో 50 శాతం మరే ఎంపీ అయినా కష్టపడుతున్నాడా ? అంటూ భరత్ అనడం హాస్యాస్పదంగా ఉందన్నారు. వాస్తవానికి పార్లమెంట్‌లో జరిగిన డిబేట్స్‌లో శ్రీకాకుళం ఎంపీ కింజరాపు రామ్మోహననాయుడు 80 శాతం డిబేట్స్‌లో పాల్గొంటే కాకినాడ ఎంపీ వంగా గీత 75 డిబేట్స్‌లో పాల్గొన్నారని, రీల్ స్టార్ రాజమహేంద్రవరం ఎంపీ భరత్ కేవలం 46 డిబేట్స్‌లోనే పాల్గొన్నారని చెప్పారు. ఎంపీ నిధుల వినియోగం విషయానికి వస్తే ఎంపీ రామ్మోహననాయుడు 89 శాతం నిధులు వినియోగించుకున్నారని, భరత్‌రామ్ మాత్రం కేవలం 62 శాతం నిధులు వినియోగించుకున్నారని చెప్పారు. మరోపక్క రాష్ట్ర ప్రభుత్వం నుంచి నిధులు తీసుకురావడం చేతకాదని నగర పాలక సంస్థ నిధులను దుర్వినియోగం చేస్తూ ప్రజల సొమ్మును తన బిల్డప్ కోసం వాడుకుంటున్నాడని ధ్వజమెత్తారు. టీడీపీ హయాంలో పోలవరం పనులు 72 శాతం పూర్తయితే వైసీపీ ప్రభుత్వం కేవలం 4 శాతం మాత్రమే పూర్తి చేసిందని మండిపడ్డారు. టీడీపీ హయాంలో నగరంలో టెన్నిస్ కోర్టు, ఆర్ట్స్ కళాశాల మైదానంలో రన్నింగ్ ట్రాక్, స్కేటింగ్ రింగ్ వంటివన్నీ పూర్తి చేసామని, అయితే వాటిపై భరత్‌రామ్ బిల్డప్ వ్యాఖ్యలు చేస్తున్నారని, భరత్‌రామ్ చేసేవన్నీ చిల్లర రాజకీయాలని మండిపడ్డారు. దమ్ముంటే జగన్‌ను రాజమండ్రిలో పోటీకి దింపండి..డిపాజిట్లు కూడా రావన్నారు. ఇప్పటికే జగన్‌కు సన్‌స్ట్రోక్ మాదిరిగా సిస్టర్ స్ట్రోక్ తగిలిందని జగనన్న బాణమే జగన్‌కు తిరిగి గుచ్చుకుంటుందని చమత్కరించారు. ఈ సమావేశంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కాశి నవీన్‌కుమార్, టీఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వర్రే శ్రీనివాసరావు, టీడీపీ నగర అధ్యక్షుడు రెడ్డి మణి, ప్రధాన కార్యదర్శి బుడ్డిగ రాధా, కార్యదర్శి లాల్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

గవర్నర్‌కు ఘనస్వాగతం



హెలీప్యాడ్‌వద్ద గవర్నర్ అబ్దుల్ నజీర్‌కు స్వాగతం పలుకుతున్న తూర్పుగోదావరిజిల్లా కలెక్టర్ మాధవీలత, ఎస్పీ జగదీష్

రాజానగరం/దివాన్‌చెరువు, జనవరి 31: జిల్లా పర్యటనకు వచ్చిన రాష్ట్ర గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్‌కు హెలీప్యాడ్ వద్ద ఘన స్వాగతం లభించింది. కాకినాడలో పర్యటన ముగించుకుని హెలికాప్టర్‌లో గైట్‌లోని హెలీప్యాడ్‌కు బుధవారం మధ్యాహ్నం 1.10 గంటలకు చేరుకున్నారు. అక్కడ జిల్లా కలెక్టర్ కె.మాధవీలత, ఎస్పీ పి.జగదీష్, జేసీ ఎన్.తేజ్‌భరత్, నన్నయ వీసీ ఆచార్య కె.పద్మరాజు, ఆర్డీవో కె.చైత్రవర్షిణి, అడిషనల్ ఎస్పీ ఎస్ఆర్ శేఖరరాజు, చైతన్య విద్యాసంస్థల చైర్మన్ కెవివి సత్యనారాయణరాజు(చైతన్యరాజు), బీజేపీ నాయకులు నీరుకొండ వీరన్న చౌదరి గవర్నర్‌కు ఘన స్వాగతం పలికారు. చైతన్యరాజు గవర్నర్‌ను ఘనంగా సత్కరించి, జ్ఞాపికను అందజేశారు. అనంతరం విశ్వవిద్యాలయంలోని వసతి గృహానికి చేరుకున్నారు. స్నాతకోత్సవ వేదిక వద్ద గవర్నర్ గౌరవ వందనం స్వీకరించారు.

ఎన్నికల నేపథ్యంలో

పలువురు అధికారుల బదిలీలు

- కొందరు సాధారణ బదిలీలు
- 13మంది ఎండీవోలు, పలువురు తహశీల్దార్లు ఇతర జిల్లాలకు

రాజమహేంద్రవరం, జనవరి31(ఆంధ్రజ్యోతి): త్వరలో జరగబోయే సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో మూడేళ్ల దాటి జిల్లాలో పనిచేస్తున్న పలువురు అధికార్లు బదిలీ అయ్యారు. ఎంపీడీవోలు, తహశీల్దార్‌లను ఇతర జిల్లాలకు కేటాయించారు. ఇంకా పోస్టింగ్‌లు ఇవ్వలేదు.ఇక రుడా సెక్రటరీ విశాఖపట్నం కార్పొరేషన్‌లో పనిచేసి ఎ.చంద్రిక నియమితులయ్యారు. ఇక్కడి సెక్రటరీ జి.శైలజ విశాఖ జోనల్ కమిషనర్‌గా బదిలీ అయ్యారు. నిడదవోలు కమిషనర్‌గా పిఠాపురం మున్సిపల్ కమిషనర్‌గా పనిచేస్తున్న టిఎల్‌పిఎస్ఎస్ కృష్ణవేణి నియమితులయ్యారు. నిడదవోలు కమిషనర్ కె.వి.పద్మావతి పెద్దాపురం కమిషనర్‌గా నియమితులయ్యారు. పోలవరం ఎల్‌ఎంసి భూసేకరణ డిప్యూటీ కలెక్టర్ (కొవ్వూరు)గా ఆర్.వెంకటరమణ నాయక్ నియమితులయ్యారు. ఇక్కడ పనిచేసిన ఎం.జాన్సీ రాణి కోనసీమ జిల్లా ఐసీడీఎస్ పీడీగా నియమితులయ్యారు. తూర్పుగోదావరి సివిల్ సప్లయిస్ డీఎంగా తిరువీదేదుల రాధిక నియమితులయ్యారు. ఇటీవల ఇక్కడ డీఎం ముందుగానే బదిలీ అయ్యారు. గోపాలపురం ఓఎన్‌జిని భూసేకరణ ఆర్వోగా కె.లక్ష్మీ శివ జ్యోతి నియమితుల య్యారు. రాజమహేంద్రవరం గెయిల్ పరిధిలోని శ్రీకాకుళం. అంగుల్ గ్యాస్ పైపులైన్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌గా ఎం.మాధురి నియమితులయ్యారు. ఇక్కడ పనిచేసిన ఎబివిఎస్‌బి శ్రీనివాస్ బదిలీ అయ్యారు.

రెవెన్యూశాఖలో.. రాజమహేంద్రవరం కలెక్టరేట్ ఎఓగా ఏలూరు కలెక్టరేట్ ఏవో బి.రమాదేవి, ఉండ్రాజవరం తహశీల్దార్ జి.కనకరాజు రాజమహేంద్రవరం తహశీల్దార్‌గానూ, తాళ్లపూడి తహశీల్దార్ కోనసీమ కు, పెరవలి తహశీల్దార్ టి.రాజరాజేశ్వరి రాజమహేంద్రవరానికి, దేవరపల్లి తహశీల్దార్ కృష్ణాకు, గోపాలపురం తహశీల్దార్ కృష్ణాకు కొవ్వూరు తహశీల్దార్ బి.నాగరాజునాయక్ రాజమహేంద్ర వరానికి బదిలీ అయ్యారు. జిల్లాలో 13మంది ఎంపీడీవోలను ఇతర జిల్లాలకు కేటాయించారు. డీపీవో జె.సత్యనారాయణ బదిలీ అయ్యారు.

ఏజెన్సీ నుంచి 9 మంది తహశీల్దార్ల బదిలీ

రంపచోడవరం: ఏజెన్సీలోని రంపచోడవరం, ఎటపాక రెవెన్యూ డివిజన్ల పరిధిలోని 9 మంది తహశీల్దార్లను ఇతర జిల్లాలకు బదిలీ చేస్తూ భూపరిపాలనా చీఫ్ కమిషనర్ ఆదేశాలు జారీ చేశారు. వారి వివరాలు ఇలా ఉన్నాయి. రంపచోడవరం సబ్ కలెక్టరు కార్యాలయం పరిపాలనాధికారిణి ఎమ్.సావిత్రి, వై.రామవరం తహశీల్దారు సీహెచ్ శ్రీనివాసరావు, రాజవొమ్మంగి తహశీల్దారు వై.వి.ఎస్.ఆచారిని రాజమహేంద్రవరం జిల్లాకు, అడ్డతీగల తహశీల్దారు ఎ.తాతారావు, రంపచోడవరం తహశీల్దారు పీవీవీజె సూర్యకుమార్‌కు భీమవరం జిల్లాకు, మారేడుమిల్లి తహశీల్దారు టి.శ్రీనివాసరావు, దేవీపట్నం తహశీల్దారు కె.సత్యనారాయణ, కూనవరం తహశీల్దారు కె.అనసూయ, చింతూరు తహశీల్దారు కె.సుబ్బారావును కృష్ణా జిల్లాకు బదిలీ చేశారు. వీరి స్థానాల్లో వేరే జిల్లాల నుంచి ఉమ్మడి తూర్పు, విశాఖ జిల్లాలకు వచ్చిన తహశీల్దార్లను కేటాయించాల్సి ఉంది.

జాతీయస్థాయి బాస్కెట్‌బాల్ పోటీలకు

ఏపీ జట్టు ఎంపిక



జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొనే ఆంధ్రప్రదేశ్ బాస్కెట్‌బాల్ జట్టు

పిఠాపురం, జనవరి 31: జాతీయస్థాయి బాస్కెట్‌బాల్ పోటీల్లో పాల్గొనే ఆంధ్రప్రదేశ్ జట్టును బాస్కెట్‌బాల్ అసోసియేషన్ రాష్ట్ర ప్రతినిధులు బుధవారం ప్రకటించారు. కాకినాడజిల్లా పిఠాపురంలోని పాతబస్టాండ్ వద్దగల బాస్కెట్‌బాల్ క్రీడామైదానంలో రెండు వారా లుగా జరుగుతున్న నేషనల్ బాస్కెట్‌బాల్ జూనియర్స్ బాలుర కోచింగ్ క్యాంప్‌లో చూపిన ప్రతిభ ఆధారంగా క్రీడాకారులను ఎంపిక చేశారు. ఏపీ జట్టులో జి.సత్యప్రకాష్, కె.ద్వారకానాథ్‌రెడ్డి, వి.అఖిల్‌కుమార్, రాహుల్, ఎం.గురుచరణ్, వై.పవన్‌కుమార్, సీహెచ్.ఫణీంద్ర, ఎస్.స్నేహిత్, ఏ.తేజ, జి.నగేష్‌బాబు, బి.దేవందర్ సాయి, ఎస్‌కే అర్షద్‌బాషాలు ఎంపిక కాగా స్టాండ్‌బైలుగా జి.అమిత్ ఆర్యా, పి.పవన్‌కుమార్‌రెడ్డి, పి.చైతన్య ఉంటారు. ఎంపిక ప్రక్రియను అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గన్నమనేని చక్రవర్తి, జా యింట్ సెక్రటరీ బొజ్జా మాణిక్యాలరావు, ఎంపిక కమిటీ అధ్యక్షుడు నడింపల్లి అప్పలరాజు, కోచ్ ఎంఎ రుద్ర, జిల్లా కమిటీ సభ్యుడు కొత్తెం సుందరకుమార్ తదితరులు పాల్గొన్నారు. ఎంపికైన క్రీడాకారులకు రాష్ట్ర అసోసియేషన్ తరఫున కిట్లను మునిసిపల్ కమిషనర్ కనకారావు, పాదగయ చైర్మన్ ఆగంటి ప్రభాకరరావు, బొజ్జా దొరబాబు, కౌన్సిలర్లు పెదపాటి నాగేశ్వరరావు, మరం లోవ రాజు తదితరులు అందజేశారు.

ప్రతిభకు పురస్కారం

- జేఎన్టీయూకే స్నాతకోత్సవంలో పలువురికి పీహెచ్‌డీలు, బంగారు పతకాలు



జేఎన్‌టీయూకే వీసీ, అతిథులతో పీహెచ్‌డీ గ్రహీతలు

జేఎన్టీయూకే, జనవరి 31: కాకినాడ జేఎన్టీయూకే పదో స్నాతకోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో వర్సిటీ కులపతి, రాష్ట్ర గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్ నుంచి 64మంది పీహెచ్‌డీ అవార్డులు, 28మంది బంగారు పతకాలు అందుకున్నారు. వారిలో కొందరి అభిప్రాయాలు ఇవి..

కుల వ్యవస్థ, లింగ అసమానతలపై పరిశోధన చేశాను

- ఎం.జయ, పీహెచ్‌డీ



కుల వ్యవస్థ, లింగ అసమానతలు ఇంకా మన దేశంలో వేళ్లూనికుని ఉన్నాయి. అగ్ర కులస్థులు దళితులపై జరుపుతున్న దాడులకు అంతులేకుండా పోతోంది. ముఖ్యంగా దళిత స్త్రీలు భూస్వాముల చేతిలో అరాచకాలకు బలైపోతున్నారు. విద్యకు దూరమై ఇంటా బయట సమస్యల వలయంలో చిక్కుకుంటున్నారు. అందుకే కులవ్యవస్థ, లింగ అసమానతలపై పరిశోధన చేశాను. గవర్నర్ నుంచి పీహెచ్‌డీ పట్టా అందుకోవడం చాలా సంతోషంగా ఉంది.

అల్జీమర్స్ వ్యాధిపై పరిశోధన

- కె.ఝాన్సీ రాణి, పీహెచ్‌డీ



మెదడులోని నిర్మాణాల ద్వారా ఇమేజెస్‌తో అల్జీమర్స్ వ్యాధికి సంబంధించి జ్ఞాపకశక్తి ఎలా తగ్గిపోతుందో అనే అంశంపై పరిశోధన చేశాను. ప్రస్తుతం జేఎన్టీయూకేలోని ఈసీఈ ఇంజనీరింగ్ విభాగంలో అధ్యాపకురాలిగా పనిచేస్తున్నాను. పీహెచ్‌డీ పట్టాను గవర్నర్ నుంచి అందుకోవడం నా జీవితంలో మరచిపోలేనిది.

లిక్విడ్ క్రిస్టల్స్‌పై పరిశోధన

- ఎం.సురేఖ, పీహెచ్‌డీ



భౌతికశాస్త్రంలో లిక్విడ్ క్రిస్టల్స్‌పై పరిశోధన చేశాను. దీనిద్వారా ఎల్‌సీడీ టీవీలోని దృశ్యాన్ని ఏవైపు నుంచైనా చూడవచ్చు. నా భర్త, మావయ్య ప్రోత్సాహం, ఆసక్తితో పీహెచ్‌డీ పూర్తి చేశాను. పీహెచ్‌డీ పట్టాను స్నాతకోత్సవంలో అందుకోవడం చాలా సంతోషంగా ఉంది.

సివిల్‌లో పీహెచ్‌డీ సాధించా

- జి.వెంకటరామాంజనేయులు, పీహెచ్‌డీ



సివిల్ ఇంజనీరింగ్‌లో పీహెచ్‌డీ సాధించడం ఆనందంగా ఉంది. ఉష్ణోగ్రత పెరిగినా, తగ్గినా ఒత్తిడి పెరుగుతుంది. దానివల్ల ఇనుప లోహంలో పగుళ్లు ఎన్నిరోజుల్లో పడతాయో అనేదానిపై పరిశోధన చేశాను.

పీహెచ్‌డీ నా జీవితాశయం

- ఎం.ప్రియదర్శిని, పీహెచ్‌డీ



ఫార్మసీలో పీహెచ్‌డీ సాధించడంతో నా జీవితాశయం నెరవేరింది. పీహెచ్‌డీని కుటుంబసభ్యుల సమక్షంలో తీసుకోవడం చాలా సంతోషంగా ఉంది. ఫార్మసీలో సాల్యుబిలిటీ డిసొల్యూషన్ రేటు పెంపుదల ఫార్ములేషన్ అభివృద్ధిపై పరిశోధన చేశాను. పీహెచ్‌డీ పొందడం నా జీవితంలో మధురమైన ఘట్టంగా నిలిచిపోతుంది.

బంగారు పతకాలు

మార్కులకోసం చదవకూడదు



-పి.సంధ్య, బంగారు పతకం

మార్కులకోసం కాకుండా సబ్జెక్టు పరంగా చదివితే విజయం సాధించవచ్చు. సివిల్‌లో బంగారు, అల్లం అప్పారావు ఎండోమెంట్ పతకాలు సాధించాను. చాలా సంతోషంగా ఉంది.

మా నాన్న నాకు స్ఫూర్తి



-ఎ.జయసురేఖ, బంగారు పతకం

నేను ఈఈఈలో బంగారు పతకం సాధించడానికి మా నాన్న నాకు స్ఫూర్తి. ప్రస్తుతం జేఎస్‌డబ్ల్యూలో ఉద్యోగం చేస్తున్నాను. క్యాంపస్ ప్లేస్‌మెంట్స్‌లోఎంపికయ్యాను.

సీఎస్ఈలో బంగారు పతకం సాధించాను



-ఎన్‌ఎస్పీ శ్రీవాణి సాగరి, బంగారుపతకం

సీఎస్ఈ విభాగంలో 8.6 సీజీపీ పాయింట్లు సాధించి టాపర్‌గా నిలిచి బంగారుపతకం సాధించాను. ప్రస్తుతం హైదరాబాద్‌లోని యునైటెడ్ ఆన్‌లైన్‌లో ఉద్యోగం చేస్తున్నాను. నా తల్లిదండ్రులు ఎంతో ప్రోత్సహించారు.

కోడింగ్ నేర్చుకోవాలి



-కె.వాస్తవి, బంగారు పతకం

విద్యార్థులు స్టాండర్డ్ పుస్తకాలు చదివి కోడింగ్ నేర్చుకుంటే ఉద్యోగ అవకాశాలు ఎక్కువగా లభిస్తాయి. ఈసీఈలో బంగారు పతకం, నగదు బహుమతిని పొందడం ఆనందంగా ఉంది. నన్ను తల్లిదండ్రులు ప్రోత్సహించారు.

బీమా సొమ్ముల కోసం..

చనిపోయినట్లు నాటకం

- పాతవీరంపాలెంలో ఓ వ్యక్తి నిర్వాకం
- ప్రధాన నిందితుడి సహా నలుగురి అరెస్టు



రంగంపేటలో పాత్రికేయుల సమావేశంలో మాట్లాడుతున్న ఈస్ట్‌జోన్ డీఎస్పీ

రంగంపేట, జనవరి 31: బీమా సొమ్ములకు కక్కుర్తి పడి చనిపోయినట్టు నాటకమాడిన ఓ వ్యక్తితో పాటు అతడికి సహకరించిన నలుగురిని పోలీసులు అరెస్టు చేశారు. గత నెల 26న రంగంపేట మండలం పాతవీరంపాలెంలో పూర్తిగా కాలిపోయిన గుర్తు తెలియని మృతదేహం అంటూ దినపత్రికల్లో ఓవార్త ప్రచురితమైంది. ఈ కేసుకు సంబ ంధించి బుధవారం రంగంపేట పోలీస్‌స్టేషన్‌లో రాజమహేంద్రవరం ఈస్ట్‌జోన్ డీఎస్పీ ఎం.కిషోర్‌కుమార్ పాత్రికేయుల సమావేశంలో మాట్లాడారు. సదరు ఘటనపై విచారణకు డిఎస్పీ ఎం.కిషోర్‌కుమార్, అనపర్తి సీఐ శివగణేష్ రెండు బృందాలుగా దర్యాప్తు చేపట్టారు. ఈ క్రమంలో చనిపోయాడనుకున్న కేతమళ్ళ వెంకటేశ్వరరావు(పూసయ్య) బతికున్నట్టు తెలుసుకుని అతడిని స్టేషన్‌కు పిలిపించి విచారించగా.. గత నెల 26న తెల్లవారుజామున తాను పొలంలోకి వెళ్తుండగా ముగ్గురు వ్యక్తులు ఆటోలో వచ్చి కేతమళ్ల గంగారావు పొలంలోని ట్రాన్స్‌ఫార్మర్ వద్ద ఓ శవాన్ని పడేసి నిప్పు అంటించడం చూసి వారిని వెంబడించి పట్టుకోవడానికి ప్రయత్నించగా వారు తనను గాయపరిచి అపస్మారక స్థితిలోకి వెళ్లి న తర్వాత ఆటోలో ఎక్కించుకొని రాజమహేంద్రవరం రూరల్ మండలం పిడింగొయ్యి గ్రామంలోని పొలాల వద్ద వదిలేసి వెళ్లిపోయినట్టు చెప్పాడు. అయితే పోలీసులు సీసీ కెమెరా ఫుటేజ్, సాంకేతిక ఆధారాలు, ఐటీ కోర్ టీం సహాయంతో పూసయ్య చెప్పినదంతా అబద్ధమని గుర్తించారు. ఆపై తమదైన శైలిలో విచారించగా నేరాన్ని అంగీకరించాడు. తాను ఎల్‌ఐసీ పాలసీని రెండు నెలల క్రితం తీసుకున్నానని, పాలసీ ప్రకారం సాధారణ మరణమైతే రూ.20లక్షలు, ప్రమాద మరణమైతే రూ.40 లక్షల వస్తాయని భావించానన్నాడు. తాను చనిపోయినట్టుగా సమాజాన్ని, ఇన్సూరెన్స్ కంపెనీని నమ్మించి మోసం చేద్దామనే ఉద్దేశ్యంతో ఎవరైనా చనిపోయిన మగ వ్యక్తిని తీసుకు రమ్మని, అలా తీసుకొస్తే.. అది కరెంట్ షాక్ తగిలి చనిపోయినట్టు(యాక్సిడెంట్ డెత్)గా చిత్రీకరించి ఎల్ఐసీ ఇన్సూరెన్స్ పొందవచ్చునని పథకం వేశానన్నాడు. ఈ మేరకు తన స్నేహితుడైన హుకుంపేటకు చెందిన వందే శ్రీనుకు రూ.10 వేలు ఇచ్చి ఆ పని అప్పగించగా.. శ్రీను శ్మశానాలవద్ద గోతులు తవ్వే హుకుంపేటకు చెందిన తలారి సుబ్బారావు, మోరంపూడికి చెందిన చీర చిన్నిలకు ఆ పని అప్పజెప్పాడు. ఆ ముగ్గురు 25వ తేదీ అర్ధరాత్రి పాత బొమ్మూరు శ్మశావాటిక నుంచి మగ శవాన్ని దొంగిలించి శ్రీను కారులో ఎక్కించుకొని రంగంపేట మండలం పాత వీరంపాలెంలోని కేతామళ్ళ గంగారావు పొలంలోని ట్రాన్స్‌ఫార్మర్ వద్దకు తీసుకొచ్చారు. అనంతరం నలుగురు కలిసి నిప్పు అంటించినట్టు పూసయ్య చెప్పాడని డీఎస్పీ వివరించారు. ఆశవం ఎవరిదో దర్యాప్తు చేసి వారి బంధువులకు పంచనామాచేసి అనంతరం అప్పగిం చినట్టు పోలీసులు చెప్పారు. ఈ కేసులో పూసయ్యను ఎ1 నిందితుడిగా చేర్చామన్నారు. నిందితులు నలుగురిని ఈనెల 30న అరెస్ట్ చేసి, రిమాండ్‌కి పంపామని డీఎస్పీ ఎం.కిషోర్‌కుమార్ తెలిపారు. అనపర్తి సీఐ శివగణేష్, రంగంపేట ఎస్ఐ పి.విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

కాకినాడ తీరంలో ముగిసిన జల ప్రహార్ సైనిక విన్యాసాలు





బీచ్‌లో పొజిషన్ తీసుకుంటున్న సైనికులు, యుద్ధ నౌక ఎల్ 23 నుంచి రోప్‌లతో చిన్నబోటులోకి దిగుతున్న సైనికులు

సర్పవరం జంక్షన్, జనవరి 31: కాకినాడ సాగరతీరం సూర్యారావుపేట నావెల్ ఎన్‌క్లేవ్‌లో భారత తూర్పు నావికా దళం, ఆర్మీల సంయుక్తంగా నిర్వహించిన బైయాన్యువల్ జాయింట్ ఎక్సర్‌సైజ్ విన్యాసాలు మంగళవారంతో ముగిశాయి. డీప్ సముద్రంలో గత తొమ్మిదిరోజులుగా ఇండియన్ నేవీ, ఆర్మీల జాయింట్‌గా యాంపిబియాస్ యూనిట్స్ ఆఫ్ ఈస్ట్రన్ నేవల్ కమాండ్ ఇంటిగ్రేటెడ్ ట్రూప్స్, ఇన్ పేంటీ బ్రిగే ఇండియన్ ఆర్మీలు సైనిక విన్యాసాలు నిర్వహించారు. విన్యాసాల్లో భాగంగా వైమానికం యుద్ధవిమానాలు, యుద్ధ నౌక, యుద్ధ ట్యాంకులు, ఆర్మీ సైనికులు తమ సైనిక విన్యాసాలు నిర్వహించారు. ఈ సందర్భంగా యుద్ధం, తుపాన్లు, విపత్తు, భూభాగంలోకి అక్రమచొరబాట్లు, ఆపద సమయాల్లో సము ద్రం, ఆకాశయానం, భూమిపై నుంచి యుద్ధ సమయంలో శత్రుదేశాలపై త్రివిధ దళాలు చేపట్టే కసరత్తును గత తొమ్మిది రోజులుగా డీప్ సీలో నిర్వహించారు.

'ఆంధ్రజ్యోతి' చొరవతో వృద్ధుడికి వైద్యం

- నిర్లక్ష్యం వహించిన వైద్యులపై కలెక్టర్ సీరియస్



బుధవారం వార్డులో చికిత్స పొందుతున్న వృద్ధుడు

రాజమహేంద్రవరం, జనవరి 31(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వాస్పత్రి వద్ద 57ఏళ్ల వృద్ధుడిని అర్ధరాత్రివేళ చలిలో బయట వదిలేయడంపై 'రాజమహేంద్రవరం ఆసుపత్రి వద్ద చలిలోనే వృద్ధుడు' అనే శీర్షికతో బుధవారం 'ఆంధ్రజ్యోతి' మెయిన్ ఎడిషన్‌లో వార్త ప్రచురితమైన విషయం తెలిసిందే. దీంతో ప్రభుత్వాస్పత్రి సూపరింటెండెంట్ లక్ష్మీ సూర్యప్రభపై కలెక్టర్ మాధవీలత ఫోన్‌లో ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆస్పత్రిలో ఏం జరుగుతోందంటూ ప్రశ్నించారు. ఇలాంటి విషయాలు తన దృష్టికి కచ్చితంగా తీసుకురావాలని, వృద్ధుడికి పూర్తిస్థాయి వైద్యం అందించాలని ఆదేశించారు. దీంతో అతడికి మెడికల్ వార్డులో బెడ్ కేటాయించి రక్త పరీక్షలు చేశారు. సెలైన్ పెట్టి మందులు ఇచ్చారు. ఎంఆర్ఐ స్కానింగ్‌కి, కళ్లకు చికిత్స కోసం నేత్ర వైద్యుడికి రిఫర్ చేశారు. చాన్ బాషా అనే యాచకుడు కంటి వైద్యం కోసం నంద్యాల నుంచి తమిళనాడులోని మదురై వెళ్లాడు. ఏడాది యాచించి దాచుకున్న రూ.36వేలు తన కూడా తీసుకెళ్లాడు. మదురై వెళ్లాక డబ్బులు ఇంకా ఎక్కువ అవసరమని తెలియడంతో అక్కడి వాళ్ల సలహా మేరకు పాండిచ్చేరి వెళ్లడానికి రైలెక్కాడు. రైలులో తనను ముగ్గురు నలుగురు తీవ్రంగా కొట్టి డబ్బులు లాక్కొని ప్లాట్‌ఫాంపై పడేశారని వృద్ధుడు చెప్పాడు. ఎలాగోలా రైలెక్కి రాజమండ్రిలో దిగిపోయాడు. నెమ్మదిగా జాంపేట మసీదు వద్దకు చేరుకొని బిక్షాటన చేస్తున్నాడు. అయితే, గుర్తు తెలియని వ్యక్తులు రైలులో కొట్టడంతో గాయాలై బాధ పడుతుండడంతో స్థానికులు ఈ నెల 24న రాత్రి 8గంటల ప్రాంతంలో ప్రభుత్వాస్పత్రిలో చేర్పారు. బుధవారం(30న) వైద్యులు డిశ్చార్జి రాయగా అర్ధరాత్రి అతడిని సిబ్బంది వీల్‌ఛైర్‌లో ఆస్పత్రి నుంచి బయటకు తీసుకొస్తుండగా వీల్‌ఛైర్ గోతిలో పడడంతో ఇతడు కింద పడిపోయాడు. తనకు వైద్యం చేయకుండా ఎవరి వద్దకు పంపుతు న్నారంటూ ప్రశ్నించాడు. విషయం తెలుసుకున్న 'ఆంధ్రజ్యోతి' వెళ్లి వివరాలు సేకరించి, వృద్ధుడి పట్ల అర్ధరాత్రి వేళ ఈ తీరు సరికాదని నిలదీయడంతో ఆ వృద్ధుడిని ఆస్పత్రిలోకి తరలించారు. కనీస మానవత్వం లేకుండా సంబంధీకులు ఎవరూ లేని వృద్ధుడిని అర్ధరాత్రి వేళ ఆస్పత్రి సిబ్బంది ఎక్కడి తరలిస్తున్నారనే ప్రశ్నకు సమాధానం కరువైంది. కాగా.. ఆ వృద్ధుడికి ఇక్కడ ఎవరూ లేకపోవడంతో దుస్తులు కూడా దుర్వాసన వస్తున్నాయి. దాతలు ఆదుకోవాలని అతడి దుస్థితి చూసినవారు విజ్ఞప్తి చేస్తున్నారు.

ఉపాధ్యాయ పోస్టుల ఖాళీలెన్ని

- 50వేల పోస్టులు ఖాళీ అని కేంద్రానికి చెప్పిన మాట వాస్తవం కాదా
- జగన్‌ను సూటిగా ప్రశ్నించిన ఎమ్మెల్సీ ఐవీ



అమలాపురం టౌన్, జనవరి 31: రాష్ట్రంలో ఉపాధ్యాయ పోస్టులు ఖాళీలు ఎన్ని ఉన్నాయో స్పష్టం చేయాలని పీడీఎఫ్ ఎమ్మెల్సీ యిళ్ల వెంకటేశ్వరరావు (ఐవీ) ప్రశ్నించారు. రాష్ట్రంలో సుమారు 50వేల ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉన్నాయని కేంద్రానికి చెప్పిన మాట వాస్తవమా కాదా అన్నారు. అసలు ఈ లెక్కల మతలబులేమిటో స్పష్టం చేయాలన్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురంలోని యూటీఎఫ్ హోంలో బుధవారం జరిగిన సమావేశంలో ఐవీ మాట్లాడారు. 6,100 పోస్టులతో డీఎస్సీ వేస్తామని రాష్ట్ర కేబినెట్ సమావేశంలో ముఖ్యమంత్రి ప్రకటించడంపై ఆయన పలు అనుమానాలు వ్యక్తం చేశారు. 2018లో డీఎస్సీ వేశారని తిరిగి ఆరేళ్ల తరువాత రాష్ట్రంలో 6వేల పోస్టులే ఖాళీగా ఉన్నాయా అన్నారు. చరిత్రలో ఐదేళ్లకు ఒక్క డీఎస్సీ కూడా వేయని సీఎంగా జగన్ చిరస్థాయిగా నిలుస్తారన్నారు. పాదయాత్ర నాటికి రాష్ట్రంలో 23వేల ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉంటే చంద్రబాబు ఏం చేస్తున్నారని జగన్ ప్రశ్నించిన మాట వాస్తవమా కాదా అని నిలదీశారు. మరి ఈ ఐదేళ్లలో ఈ డీఎస్సీ కూడా ఎందుకు వేయలేదన్నారు. విభజన ఏపీకి వచ్చిన ఉపాధ్యాయ పోస్టులు ఎన్ని, ప్రస్తుతం పనిచేస్తున్న ఉపాధ్యాయులు ఎంతమందో చెప్పాలన్నారు. 18,680 ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉన్నాయని చెప్పి 6,100 పోస్టులతో డీఎస్సీ ప్రకటించడం ఏమిటన్నారు. లక్షలాది మంది డీఎస్సీ కోసం ఎదురు చూస్తుంటే వారి ఆశలన్నీ అడియాశలు చేశారన్నారు. మరోవైపు 1994లో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన దుర్మార్గమైన అప్రంటీస్ విధానాన్ని 15 ఏళ్లపాటు ఉపాధ్యాయ సంఘాలు పోరాటాలు చేసి రద్దు చేయించుకుంటే నేడు మళ్లీ వైసీపీ ప్రభుత్వం అదే విధానాన్ని తీసుకురావడం సిగ్గుచేటన్నారు. అప్రంటీస్ విధానం అమలు చేస్తామన్న ప్రకటనను ప్రభుత్వం తక్షణం వెనక్కు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రెగ్యులర్ ఉపాధ్యాయులనే నియమించాలన్నారు.

4న జడ్పీ సర్వసభ్య, స్టాండింగ్ కమిటీల సమావేశాలు

కాకినాడ సిటీ, జనవరి 31: ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రజాపరిషత్ సర్వ సభ్య సమావేశం, స్టాండింగ్ కమిటీల సమావేశాలు ఫిబ్రవరి 4వ తేదీన నిర్వహిస్తున్నట్లు జడ్పీ ముఖ్య కార్యనిర్వహణాధికారి ఏ రమణారెడ్డి తెలిపారు. ఆదివారం ఉదయం 10.30 గంటల నుంచి కాకినాడ జిల్లాపరిషత్ కార్యాలయంలోని జీఎంసీ బాలయోగి సమావేశ మందిరంలో జరుగుతాయని తెలిపారు. 3వ తేదీన జరగాల్సిన ఈ సమావేశాలు అనివార్య కారణాల వల్ల 4వ తేదీకి మార్చడం జరిగిందని ఆయన తెలిపారు.

సత్యదేవుడి హుండీల ఆదాయం రూ. 1.70 కోట్లు



హుండీలలో కానుకలను లెక్కిస్తున్న సిబ్బంది

అన్నవరం, జనవరి 31: సత్యదేవుడికి భక్తులకు హుండీలలో సమర్పించిన కానుకలను బుధవారం లెక్కించగా రూ.1,70,15,123 నగ దు, 40 గ్రాముల బంగారం, 1020 గ్రాముల వెండి సమకూరాయి. వీటితోపాటుగా యుఎస్‌ఏ 291 డాలర్లు, సింగపూర్ 26, యుఏఈ 30 దిరహమ్స్, సౌదీఅరేబియా 212 డాలర్లు లభించాయి. 36 రోజులకు ఈ ఆదాయం లభించగా సరాసరిన రోజుకు రూ.4.72 లక్షలు భక్తుల హుండీలలో కానుకల రూపంలో వేశారు. లెక్కింపును ఈవో రామచంద్రమోహన్, చైర్మన్ రోహిత్‌లు పర్యవేక్షించగా సిబ్బంది, పురోహితులు, నాయీబ్రాహ్మణులు లెక్కించారు.

బ్లేడ్‌తో వ్యక్తిపై దాడి

గోకవరం, జనవరి 31: బ్లేడ్ బ్యాచ్ సంస్కృతి పట్టణాల నుంచి పల్లెలకు పాకుతోంది. ఇప్పటివరకు రాజమహేంద్రవరం వెళ్లి రావాలంటే ప్రాణాలను అరిచేతిలో పెట్టుకొని ప్రయాణాలు సాగిస్తున్న ప్రయాణికులకు తాజాగా గోకవరంలో జరిగిన సంఘటన మరింత భయభ్రాంతులకు గురిచేస్తోంది. గోకవరం పోలీస్‌స్టేషన్ పక్కనే ఉన్న ఓ రెస్టారెంట్‌లో పనిచేసే వ్యక్తిపై బుధవారం రాత్రి బ్లేడ్‌తో ముగ్గురు యువకులు దాడిచేసి గాయపర్చారు. ఈ సంఘటనపై బాధితుడు పోలీసులను ఆశ్రయించినట్టు తెలియవచ్చింది. మండలంలోని కామరాజుపేటకు చెందిన ములపర్తి రాజు కొంతకాలంగా గోకవరంలోని ఓ రెస్టారెంట్‌లో వర్కర్‌గా పనిచేస్తున్నాడు. ఈ క్రమంలో గోకవరం గ్రామానికి చెందిన ముగ్గురు యువకులు బిర్యానీ కోసం రెస్టారెంట్‌కు వెళ్ళారు. ఆ సమయంలో బిర్యానీ రేటు విషయంలో రాజుకు ఆ ముగ్గురు యువకుల మధ్య వాగ్వాదం జరిగింది. అప్పటికే మద్యంమత్తులో ఉన్న ఆ ముగ్గురు.. రాజుపై బ్లేడుతో దాడిచేసి వీపు, మెడ, చెయ్యి తదితర భాగాలలో గాయపర్చినట్లు బాధితుడు బంధువుల ద్వారా తెలియవచ్చింది. అంతేకాకుండా రెస్టారెంట్‌లోని ఫర్నీచర్ కూడా ఈఘటనలో ధ్వంసం అయ్యాయి. జరిగిన సంఘటనపై బాధితుడు స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు సమాచారం. కాగా గాయపడిన రాజును స్థానిక ప్రభుత్వాసుపత్రిలో చేర్పించి చికిత్స అందించిన అనంతరం ఇంటికి తరలించినట్లు తెలియవచ్చింది. ఇదివుండగా పోలీస్ స్టేషన్ పక్కనే సంఘటన జరగడం, ఈవార్త దావనంలా వ్యాపించడంతో స్థానిక ప్రజలు భయభ్రాంతులకు గురయ్యారు. సమీపంలోనే పోలీస్ స్టేషన్ ఉన్నా బ్లేడుతో దాడి చేయడం చూస్తుంటే ప్రస్తుత ప్రభుత్వ హయంలో శాంతిభద్రతల చర్యలు ఎలా ఉన్నాయో అర్థమవుతుందంటూ పలువురు చర్చించుకోవడం వినిపించింది.

రాష్ట్రస్థాయి రగ్బీ పోటీలకు ఉమ్మడి జిల్లా జట్టు ఎంపిక

పిఠాపురం, జనవరి 31: రాష్ట్రస్థాయి రగ్బీ పోటీల్లో పాల్గొనే ఉమ్మడి తూర్పుగోదావరిజిల్లా రగ్బీ జట్టు ఎంపిక బుధవారం కాకినాడ జిల్లా పిఠాపురంలో జరిగింది. రగ్బీ అసోసియేషన్ ఆధ్వ ర్యంలో పట్టణంలోని ఆర్‌ఆర్‌బీహెచ్‌ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడామైదానంలో నిర్వహించిన ఎంపిక పోటీలకు ఉమ్మడి జిల్లా నుంచి 85మంది క్రీడాకారులు హాజరయ్యారు. పోటీల్లో చూపి న ప్రతిభ ఆధారంగా విశాఖలో ఈనెల 2 నుంచి 4వ తేది వరకూ జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనేందుకు 12మంది వంతున 24మంది బాలబాలికలను ఎంపిక చేశారు. వీరు ఉమ్మడిజిల్లాకు ప్రాతినిధ్యం వహిస్తారు. ఎంపిక ప్రక్రియలో రగ్బీ అసోసియేషన్ ఉమ్మడిజిల్లా అధ్యక్షుడు ఇమ్మిడిశెట్టి నాగేంద్రకుమార్, టెక్నికల్ కమి టీ చైర్మన్ నాగలింగేశ్వరరావు, కె.పద్మనాభం, వంశీ, నవీన్, సతీష్, వై.తాతబ్బాయి, పీడీలు శేషుకుమారి, సతీష్, ఎలిఫే సునీల్‌దేశాయి, సతీష్ భార్గవ్ పాల్గొన్నారు.



రాష్ట్రస్థాయి రగ్బీ పోటీలకు ఎంపికైన ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా జట్టు

2, 3 తేదీల్లో పరీక్షలకు

ఇంటర్ విద్యార్థులు హాజరుకావాలి

రాజమహేంద్రవరం, జనవరి 31(ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలు-2024లో భాగంగా ఫిబ్రవరి 2న జరిగే నైతికత- మానవీయ విలువలు, 3న నిర్వహించే పర్యావరణ విద్య పరీక్షలకు మొదటి ఏడాది జనరల్, ఒకేషనల్ విద్యార్థులు తప్పనిసరిగా హాజరుకావాలని ఇంటర్మీడి యట్ బోర్డు ప్రాంతీయ పర్యవేక్షకులు ఎన్ఎస్‌వీఎల్ నరశింహం తెలిపారు. ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 1గంటల వరకూ ఈ పరీక్షలు జరుగుతాయని.. వీటిలో ఉత్తీర్ణత సాధించకపోతే ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకా రం ఇంటర్ పాస్ సర్టిఫికెట్ జారీ చేయరన్నారు. అలాగే ఫిబ్రవరి 5 నుంచి 20 వరకూ ఒకేషనల్, 11 నుంచి 20 వరకూ జనరల్ విద్యార్థులకు ప్రాక్టికల్ పరీ క్షలు నిర్వహిస్తారన్నారు. విద్యార్థులు తమ బ్యాచ్ తెలుసుకొని పరీ క్షలకు హాజరుకావాలని ఆయన సూచించారు.

తూర్పుగోదావరి

• రాజమహేంద్రవరం సిటీ/ రూరల్ • రాజానగరం • అనపర్తి • కొవ్వూరు • నిడదవోలు • గోపాలపురం

ఏజెన్సీ సమాచారం

గిరిజన యువత ఆర్థికాభివృద్ధికి శిక్షణా కోర్సులు

● ఐటీడీఏ పీవో సూరజ్ గనోరే



రంపచోడవరం, జనవరి 31: గిరిజన యువత ఆర్థికాభివృద్ధికి తోడ్పాడునందించేందుకు యూత్ ట్రైనింగ్ సెంటర్లలో డ్రైవింగ్, బ్యూటీ షియన్, హ్యాండ్ ఎంబ్రైడింగ్, పుట్టగొడుగుల పెంపకం, వెదురుతో వస్తువుల తయారీ తదితర కోర్సులలో 60 రోజులపాటు ఉచిత శిక్షణను కల్పిస్తున్నట్లు ఐటీడీఏ పీవో సూరజ్ గనోరే తెలిపారు. ఆసక్తిగల గిరిజన యువత రంపచోడవరం, అసిస్టెంట్ ప్రాజెక్టు డైరె క్టరు, వెలుగు కార్యాలయంలో ఈనెల 3వ తేదీ శనివారంలోగా దరఖా స్తులను అందజేయాలని సూచించారు. డివిజన్ పరిధిలోని ఏడు మండలాల్లో శిథిలావస్థ లో ఉన్న గ్రంథాలయాలను పునర్‌నిర్మించి డిజిటల్ లైబ్రరీగా ఏర్పాటుచేసి అందుబాటులోకి తీసుకు వచ్చినట్లు తెలిపారు. విద్యార్థులు, గిరిజన యువత సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

పోలింగ్ కేంద్రాల్లో మౌళిక సదుపాయాలపై ప్రత్యేక దృష్టి : సబ్‌కలెక్టర్



రాజవొమ్మంగి, జనవరి 31: రానున్న ఎన్నికలకు పోలింగ్ కేంద్రాల్లో మౌళిక సదుపాయాలు కల్పించేలా చర్యలు చేపడుతున్నామని రంపచోడవరం సబ్ కలెక్టర్ ప్రశాంత్‌కుమార్ అన్నారు. బుధవారం మండలంలోని జడ్డంగి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని, తంటికొండ గ్రామంలోని పోలింగ్ కేంద్రాన్ని ఆయన తనిఖీ చేశారు. అనంతరం రాజవొమ్మంగి తహశీల్దార్ కార్యాలయంలో సెక్టర్ అధికారులు, బీఎల్‌వోలతో సబ్ కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఎన్నికల విధుల పట్ల సిబ్బందికి కీలక సూచనలు చేశారు. పాత్రికేయులతో సబ్ కలెక్టర్ ప్రశాంత్ కుమార్ మాట్లాడుతూ జాతీయ రహదారి నిర్మాణంలో భాగంగా భవనాలు కోల్పోయిన వారికి త్వరలోనే నష్టపరిహారం చెల్లించనున్నామన్నారు. తహశీల్దార్ వై.వి.సుబ్రహ్మణ్యాచార్యులు, డిప్యూటీ తహశీల్దార్ అల్లు సత్యనారాయణ, ఎంపీ డీవో ఎం.వి.రంగారావు, అధికారులు ఉన్నారు.

యువతకు వాలీబాల్ కిట్లు అందజేత

మోతుగూడెం, జనవరి31: జిల్లా ఎస్పీ, రంపచోడవరం ఓఎస్డీ, చింతూరు ఏఎస్పీ, చింతూరు సీఐ ఆదేశాల మేరకు వై. రామవరం మండలం బొడ్డగండి పంచాయతీ డొంకరాయి పోలీస్‌స్టేషన్ పరిధిలో ఉన్న సింధువాడ గ్రామంలో డొంకరాయి ఎస్ఐ శివకుమార్ అవగాహన సమావేశం నిర్వహించారు. వచ్చే ఎన్నికల్లో ఎటువంటి గొడవలు పడకూడదని, గంజాయి వైపు ప్రజలు వెళ్లకూడదని తెలిపారు. గ్రామంలో ఉన్న యువతకు వాలీబాల్ కిట్‌లు అందజేశారు.

ఆడుదాం ఆంధ్రాలో వడ్డిగూడెం జట్టు విజేత

వరరామచంద్రాపురం, జనవరి 31: ఆడుదాం ఆంధ్రా క్రికెట్ పోటీలో రంపచోడవరం డివిజన్‌స్థాయిలో గెలుపొందిన వీఆర్‌పురం మండలం వడ్డిగూడెం సచివాలయం జట్టును మండల వైసీపీ కన్వీనర్ మాదిరెడ్డి సత్యనారాయణ, మండల ఇన్‌చార్జి బొడ్డు సత్యనారాయణ ఆధ్వర్యంలో శాలువాలతో సత్కరించారు. ఈ సందర్భంగా సత్తిబాబు మాట్లాడుతూ జిల్లాస్థాయిలో పాడేరులో జరగబోయే క్రికెట్ టోర్నీలో గెలుపొంది, మండలానికి పేరు తేవాలన్నారు. ఈక్రమంలో డివిజన్‌స్థాయిలో గెలుపొంది, జిల్లాస్థాయిలో ఆడేందుకు వెళుతున్న వడ్డిగూడెం సచివాలయంజట్టుకు బోట్ యూనియన్ తరపున పదివేల రూపాయల నగదును బోట్ యూనియన్ సభ్యుడు ఎం. సత్యనారాయణ అందజేశారు.

బీజేపీ ఆధ్వర్యంలో పల్లెకు పోదాం

దేవీపట్నం, జనవరి 31: మండలంలో కొండమొదలు ఆర్అండ్ఆర్ కాలనీలో బీజేపీ నాయకులు, కార్యకర్తల ఆధ్వర్యంలో ఈనెల 9న పల్లెకు పోదాం కార్యక్రమాన్ని నిర్వహిస్తామని బీజేపీ నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమం ముఖ్యఅతిథిగా జాతీయ గిరిజన మోర్చా ఉపాధ్యక్షుడు కోసూరి కాశివిశ్వనాథ రెడ్డి హాజరయ్యారు. కార్యక్రమంలో సత్యనారాయణరెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కురస సుబ్బారావు, జిల్లా కార్యదర్శి కుండ్ల కృష్ణారెడ్డి, మండల అధ్యక్షులు కారం రామన్నదొర, మండలప్రధాన కార్యదర్శి కుండ్లసాయిరామ్‌రెడ్డి, బూత్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఆమె కోసం గిరిజన మహిళలు భిక్షాటన



భిక్షాటన చేస్తున్న జగ్గవరం మహిళలు

కూనవరం, జనవరి 31: ఐకమత్యం అంటే ఏమిటో ఆ గ్రామానికి చెందిన గిరిజన మహిళలు నిరూపించారు. గ్రామంలో ఓ మహిళకు కష్టం వస్తే ఆ గ్రామానికి చెందిన మహిళలు మేమున్నామంటూ ముందుకు వచ్చారు. కూనవరం మండలం జగ్గవరం గ్రామానికి చెందిన మడకం గౌరమ్మ ఇటీవల యాక్సిడెంట్‌లో తలకు బలమైన గాయమైంది. పరిస్థితి విషమించడంతో ఆమెను భద్రాచలంలోని ఓ ప్రయివేట్ ఆసుపత్రికి తరలించారు. గౌరమ్మకు రూ.లక్ష 50వేలు ఆపరేషన్‌కు ఖర్చవుతుందని ఆ ప్రయివేట్ వైద్యులు తెలపడంతో కుటుంబసభ్యులు చేతులెత్తేశారు. అయితే ఈ విషయం తెలుసుకున్న గ్రామస్థులు, జగ్గవరం ప్రజలు ఆమెను ఆదుకోవడానికి ముందుకు వచ్చారు. ఈమె కోసం జగ్గవరం గిరిజన మహిళలు భిక్షాటన చేసి ఆమె కోసం డబ్బులు సేకరించారు. కొంతమొత్తంలో డబ్బు సేకరించామని, మరికొంత సేకరించేదుకు తాము కృషి చేస్తామంటూ ఆ గ్రామానికి చెందిన గిరిజన మహిళలు తెలిపారు.

పేదవారికి జమాల్‌ఖాన్ సహాయం



ఆర్థిక సాయం సహాయం అందజేస్తున్న జమాల్ ఖాన్

కూనవరం, జనవరి 31: గత ఏడాది వచ్చిన వరదల్లో చందుకర్‌జయ అనే కుటుంబం సర్వం కోల్పోయింది. గోదావరి వరదల్లో ఇళ్లు కొట్టుకుపోయింది. 2022 నుంచి ఇప్పటివరకు ఇల్లు కూడా కట్టుకోలేకపోయిన బాధితులకు మేము ఉన్నామంటూ జమాల్‌ఖాన్ ముందుకు వచ్చారు. ఆ కుటుంబానికి ఇంటికి కర్చయ్యే రూ.30వేలు విలువచేసే సిమెంట్ రేకులు, ఐరన్‌పైపులు అందజేశారు. అంతేకాకుండా రూ. 30వేల నగదును అందజేశారు. ఈసందర్భంగా జమాల్‌ఖాన్ మాట్లాడుతూ కూనవరంకు చెందిన సుపి అనే వ్యక్తి పేదవారిని గుర్తించి తమకు సమాచారం అందించడంలోనే తాము సహాయం అందజేస్తామని జమాల్‌ఖాన్ తెలిపారు. ఈ కార్యక్రమంలో సుపి, సర్దార్‌హుస్సేన్, అపీజ్, హపీఉల్ల పాల్గొన్నారు.

కుట్టు శిక్షణా కేంద్రం ప్రారంభం



కుట్టుశిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న సీఆర్‌పీఎఫ్ కమాండెంట్ ధర్మప్రకాష్

వై.రామవరం, జనవరి 31: వై.రామవరం సీఆర్‌పీఎఫ్ డి-42 బెటాలియన్ పోలీసుల ఆధ్వర్యంలో బుధవారం ఎంపికైన గిరిజన యువతులకు కుట్టు శిక్షణా కార్యక్రమాన్ని ప్రారంభించారు. సీఆర్‌పీఎఫ్ కమాండెంట్ ధర్మప్రకాష్ జ్యోతిప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ స్కిల్ డవలప్‌మెంట్ ప్రోగ్రామ్‌లో భాగంగా పోలీస్‌శాఖ చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలలో భాగంగా గిరిజన మహిళలను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు కుట్టుమిషన్లు ఇచ్చి నెలరోజుల పాటు శిక్షణ ఇస్తామని దీనిని సద్వినియోగం చేసుకోవాలని కార్యక్రమంలో సర్పంచ్ పల్లాల బాలురెడ్డి, సీఆర్‌పీఎఫ్ డిప్యూటీ కమాండెంట్ రత్నమ్మ, డాక్టర్ నితిన్, డీఎస్పీ ఎంఎల్ నాయుడు, సీఐ వెంకటరమణ, ఇన్‌స్పెక్టర్ పట్టాభి, లలిత గిరిజన మహిళా మండలి ఎన్‌జీవో సాంబశివరావు, పంచాయతీ కార్యదర్శి మదుసూదనరాజులు పాల్గొన్నారు.

దూరిపల్లి బాబూరావు మృతికి సంతాపం

రంపచోడవరం, జనవరి 31: ఆదివాసీ హక్కుల వేదిక జిల్లా సభ్యుడు, విశ్రాంత ఉపాధ్యాయుడు దూరిపల్లి బాబూరావు మృతిపై ఆదివాసీ హక్కు ల వేదిక రాష్ట్ర అధ్యక్షుడు బోండ్ల వరప్రసాదరావు సంతాపం తెలిపారు. ఆయన మృతి సంఘానికి తీరనిలోటని అన్నారు.

5న చలో విజయవాడ

అనపర్తి, జనవరి 31: ప్రభుత్వ పెన్షనర్లు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం ఈనెల 5న చేపట్టిన చలో విజయవాడ కార్యక్రమం విజయవంతం చేయాలని రాష్ట్ర పెన్షనర్ల అసోసియేషన్ అనపర్తి అధ్యక్షుడు పీవీఎన్ సూర్యనారాయణ పిలుపునిచ్చారు. బుధవారం అనపర్తిలోని పెన్షనర్స్ అసోసియేషన్ భవనంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎంతో కాలంగా అపరిష్కృతంగా ఉన్న సమస్యలను పరిష్కరించుకునేందుకు విజయవాడ ధర్నా చౌక్‌లో జరిగే మహాధర్నాకు ప్రతిఒక్కరూ హాజరుకావాలని ఆయన కోరారు

పెత్తందారీ పాలనలో నష్టపోతున్న ప్రజలు

» కరపత్రం ఆవిష్కరణలో ఆదిరెడ్డి వాసు



కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న ఆదిరెడ్డి వాసు

రాజమహేంద్రవరం సిటీ, జనవరి 31: ముఖ్యమంత్రి జగన్ పెత్తందారీ పాలనలో ప్రజలు తీవ్రంగా నష్టపోతున్నారని మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు, టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ ఆదిరెడ్డి శ్రీనివాసు అన్నారు. రాజమహేంద్రవరం తిలక్‌రోడ్‌లో ఉన్న టీడీపీ కార్యాలయంలో బుధవారం పెత్తందారీ పాలనలో నష్టపోతున్న ప్రజలు అనే నినాదంతో టీడీపీ సీనియర్ నాయకులు, రాష్ట్ర అగ్నికులక్షత్రియ సాధికార కమిటీ సభ్యులు వెలమ దుర్గాప్రసాదరావు రూపొందించిన కరపత్రాన్ని వారు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చంద్రబాబు పాలనలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలకు ఏ విధంగా సంక్షేమం లభించిందో, ఎలా అభివృద్ధి చెందారో వివరించారు. రూపొందించిన ఈ కరపత్రం ద్వారా జగన్ పాలనలో ప్రజలు ఎలా నష్టపోతున్నారో వివరించినట్లు చెప్పారు. విద్యుత్ చార్జీల పెంపు భారాలు, పోలవరం ప్రాజెక్టు పట్ల నిర్లక్ష్యం, రాష్ట్రానికి రాజధాని లేకుండా చేసిన ఘనత జగన్‌కే దక్కుతుందన్నారు. వెలమ దుర్గాప్రసాదరావు మాట్లాడుతూ 10 వేల కరపత్రాలు ముద్రించామని వాటిని పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో అన్ని అసెంబ్లీ సెగ్మెంట్‌లలోను పంపిణీ చేస్తామని చెప్పారు.



మహిళకు సూపర్ సిక్స్ పథకాలను వివరిస్తున్న సిరసపల్లి

రాక్షస పాలనను అంతమొందించాలి: సిరసపల్లి

అనపర్తి, జనవరి 31: రాష్ట్రంలో కొనసాగుతున్న రాక్షస పాలనను అంతమొందించేందుకు ప్రజలు చైతన్య వంతులు కావాలని తెలుగు రైతు జిల్లా అధ్యక్షుడు సిరసపల్లి నాగేశ్వరరావు అన్నారు. బుధవారం మండలంలోని దుప్పలపూడిలో నిర్వహించిన బాబు ష్యూరిటీ-భవిష్యత్ గ్యారెంటీ కార్యక్రమంలో రెండో కూడా ఇంటింటికీ ప్రచారం నిర్వహించారు. మినీ మేనిఫెస్టోలోని అంశాలను వివరించి, ప్రజల సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ధరలతో జీవనం అస్తవ్యస్తంగా మారిందని, జగన్‌రెడ్డి పాలనపై ప్రజలు విరక్తితో ఉన్నారన్నారు. కార్యక్రమంలో చిర్ల గంగిరెడ్డి, నల్లమిల్లి వెంకటరెడ్డి, కుంత్సం కాశీవిశ్వేశ్వరరావు, మరకుర్తి అమ్మిరాజు, వల్లభశెట్టి శ్రీను, పెద్దింటి సత్తిబాబు పాల్గొన్నారు.

ఉద్యోగుల సమస్యలపై స్పందించకుంటే ఉద్యమమే

» ఏపీఎన్జీవో సంఘు రాష్ట్ర అధ్యక్షుడు బండి శ్రీనివాసరావు



శ్రీనివాసరావును సన్మానిస్తున్న ఉద్యోగ సంఘ నాయకులు

ధవళేశ్వరం, జనవరి 31: రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు రావాల్సిన అన్ని బకాయిలతో పాటు ఉద్యోగ సమస్యలపై ప్రభుత్వం స్పందించాలని ఏపీ ఎన్జీవో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బండి శ్రీనివాసరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రభుత్వం స్పందించక పోతే ఉద్యమ కార్యాచరణ చేస్తామని హెచ్చరించారు. ధవళేశ్వరంలో నూతనంగా నిర్మించిన ఇరిగేషన్ లస్కర్ అసోసియేషన్ భవన ప్రారంభోత్సవ కార్యక్రమానికి విచ్చేసిన ఆయనను ఏపీఎన్జీవో సంఘం ధవళేశ్వరం యూనిట్ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమానికి సంఘ అధ్యక్షుడు బొబ్బిలి శ్రీనివాసరావు అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో బండి శ్రీనివాసరావు మాట్లాడుతూ ఉద్యోగులందరూ సంఘటితంగా ఉండి ఉద్యమానికి సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. అనంతరం బండి శ్రీనివాసరావును సంఘ నాయకులు పూల కిరీటంతో సత్కరించారు. ఈ సందర్భంగా రాష్ట్ర జనరల్ సెక్రటరీ కేవీ శివారెడ్డి, ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు జి.రామ్మోహనరావు, పీవీ కృష్ణ తదితరులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో ధవళేశ్వరం యూనిట్ నాయకులు ఎస్.జయకుమార్, వి.లక్ష్మణుడు, పీఎస్ శేషుకుమార్, ఎస్.సత్తిరాజు, పీఎస్ గౌరీశంకర్, ఎస్.వాసుదేవి తదితరులు పాల్గొన్నారు.

పిల్లలు కచ్చితంగా బడికి వెళ్లి చదువుకోవాలి

డీఎల్ఎస్ఏ కార్యదర్శి ప్రత్యూష



కార్యక్రమంలో మాట్లాడుతున్న ప్రత్యూషకుమారి

రాజమహేంద్రవరం, జనవరి 31(ఆంధ్రజ్యోతి): ఉచిత, నిర్బంధ విద్య పొందడం పిల్లల హక్కు అని.. పిల్లలందరూ కచ్చితంగా బడికి వెళ్లి బాగా చదువుకోవాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కె.ప్రత్యూష కుమారి పిలుపునిచ్చారు. అంతర్జాతీయ వీధి బాలల దినోత్సవం సందర్భంగా డీఎల్ఎస్ఏ, జిల్లా మహిళా శిశు సంక్షేమాభివృద్ధి సంయుక్త ఆధ్వర్యంలో క్వారీ మార్కెట్ ప్రాంతంలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా పిల్లల హక్కులు, చదువు వల్ల కలిగే ప్రయోజనాలను స్థానికులకు ప్రత్యూష కుమారి వివరించారు. బాలబాలికలను పనుల్లో పెట్టడం, వారితో భిక్షాటన చేయించడం వంటివి నేరమని చెప్పారు. మహిళా శిశు సంక్షేమాభివృద్ధి అధికారిణి కె.విజయకుమారి మాట్లాడుతూ ఐదేళ్లలోపు పిల్లలను అంగన్వాడీ సెంటర్లకు పంపిస్తే పౌష్టికాహార లోపం ఉండదన్నారు. వీధి బాలలు లేకుండా చూడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. పిల్లల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

సత్వర న్యాయం అందించాలి

ప్యానల్, డిఫెన్స్ కౌన్సిల్ న్యాయవాదులతో జిల్లా 9వ అదనపు న్యాయమూర్తి ఎం.మాధురి, డీఎల్ఎస్ఏ కార్యదర్శి కె.ప్రత్యూషకుమారి మానిటరింగ్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఉచిత న్యాయ సహాయం అందిస్తున్న కేసుల వివరాలు, వాటి పురోగతిపై చర్చించారు. సత్వర న్యాయం అందించే విషయం ఎలాంటి సమస్యలు ఉన్నా సంస్థ దృష్టికి తీసుకురావాలని సూచించారు.

ఐఏపీటీ జూనియర్ సైన్స్ ఒలింపియాడ్లో శ్రీచైతన్య విద్యార్థుల ప్రతిభ



సైన్స్ ఒలింపియాడ్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులతో ఉపాధ్యాయులు

రాజమహేంద్రవరం, జనవరి 31(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వ నిధులతో ముంబైలోని హోమీబాబా సెంటర్ ఫర్ సైన్స్ అండ్ ఎడ్యుకేషన్ (హెచ్‌బీసీఎస్ఈ), ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ ఫిజిక్స్ టీచర్స్(ఐఏపీటీ) నిర్వహించిన ఐఏపీటీ-ఎన్ఎస్ఈజేఎస్ ఒలింపియాడ్లో ఆంధ్రప్రదేశ్ నుంచి 45మంది ఎంపిక కాగా అందులో రాజమండ్రి జోన్ నుంచి 9మంది విద్యార్థులు శ్రీచైతన్య మోరంపూడి ఐపీఎల్ బ్రాంచ్ నుంచే ఉన్నారని ఉత్తరాంధ్ర ఏజీఎం ఎంవీ సురేశ్ పేర్కొన్నారు. విజయం సాధించిన విద్యార్థులు ఫిబ్రవరిలో నిర్వహించే ఇండియన్ నేషనల్ జూనియర్ సైన్స్ ఒలింపియాడ్(ఐఎన్‌జేఎస్‌వో)లో పాల్గొంటారని తెలిపారు. ఇటీవల విడుదలైన ఐఎన్ఎంవో, కేవీపీవై, ఎన్‌టీఎస్ఈ వంటి ఒలింపియాడ్లలో కూడా తమ విద్యార్థులు నెం.1గా నిలిచారని శ్రీచైతన్య స్కూల్స్ అకడమిక్ డైరెక్టర్ సీమ తెలిపారు. ఈ సందర్భంగా మోరంపూడి శ్రీచైతన్యలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎంపికైన విద్యార్థులను ఏజీఎం సురేశ్, రీజనల్ ఇన్‌చార్జిలు రామాంజనేయులు, ఉదయ్‌శంకర్, జోనల్ అకడమిక్ కో-ఆర్డినేటర్ రామా రావు, ప్రిన్సిపాల్ నవ్యశ్రీ, ఐపీఎల్ సీఎస్ బ్యాచ్ ఇన్‌చార్జిలు, ఉపాధ్యాయులు అభినందించారు.

ఎలుకల మందు తయారీపై రైతులకు శిక్షణ

కోరుకొండ, జనవరి 31: కోరుకొండ మండలంలో రైతాంగానికి సామూహిక ఎలుకల మందు తయారీపై బుధవారం శిక్షణ ఇచ్చారు. జిల్లా వ్యవసాయాధికారి ఎస్. మాధవరావు, కోరుకొండ ఏడీఏ టీకే మల్లికార్జునరావు, ఏవో గౌరీదేవిల ఆధ్వర్యంలో సామూహిక ఎలుకల నివారణా కార్యక్రమం, ఎలుకల మందు తయారీపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం వారు కోరుకొండ గ్రామంలోరబీపొలాలను పరిశీలించి అక్కడ ఎలుకల నివారణకు సంబంధించి ఎలుకల అమర్చే విధానం రైతులకు వ్యవసాయ క్షేత్రంలో అవగాహన కల్పించారు.

మహిళల ఆర్థికాభివృద్ధే లక్ష్యం

రంగంపేట, జనవరి, 31: రాష్ట్రంలో మహిళల ఆర్థికాభివృద్ధే సీఎం జగన్ లక్ష్యమని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని జి.దొంతమూరు, ఈలకొలను, ఎస్టీ రాజాపురం, వడిశలేరు, ముకుందవరం, కోటపాడు గ్రామాల్లో జరిగిన డ్వాక్రా మహిళలకు ఆసరా నాలుగో విడత కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేసి మాట్లాడారు. సీఎం జగన్ ఎన్నికల హామీ మేరకు మహిళలకు నాలుగు విడతలుగా రుణమాఫీ డబ్బులను విడుదల చేశారన్నారు. అనంతరం వడిశలేరులో డ్వాక్రా యానిమేటర్లను సత్కరించారు. కార్యక్రమంలో జడ్పీటీసీ పేపకాయల రాంబాబు, జడ్పీకో ఆప్షన్ సభ్యుడు లంక చంద్రన్న, ఎంపీపీ రిమ్మలపూడి శ్రీదేవి, కొల్లాటి ఇశ్రాయేలు, పోతుల బులివీర్రాజు, మత్సా బుజ్జి, సర్పంచ్‌లు గోలి రమణ, చింతపల్లి సత్యనారాయణ, అడ్డాల పద్మ, కొల్లాటి శ్యామలావతి, వట్టికూటి సూర్యపద్మ, గవరసాని లక్ష్మీదుర్గ పాల్గొన్నారు.

రేపు విద్యుత్ సరఫరాలో అంతరాయం

అనపర్తి, జనవరి 31: మండలంలోని పీరా రామచంద్రపురం సబ్‌స్టేషన్ పరిధిలో మరమ్మతుల కారణంగా ఈ నెల 2న విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనుందని ట్రాన్స్‌కో రాజమహేంద్రవరం ఈఈ దాట్ల శ్రీధర్‌వర్మ బుధవారం తెలిపారు. సబ్‌స్టేషన్ పరిధిలోని అన్ని ఫీడర్లకు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1గంట వరకు సరఫరా నిలిపివేయనున్నట్టు చెప్పారు.

బర్ల బాబూరావుతో బత్తుల భేటీ



కోరుకొండ, జనవరి 31: జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జ్ బత్తుల బలరామకృష్ణ.. టీడీపీ సీనియర్ నాయకుడు, బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు బర్ల బాబురావుతో బుధవారం భేటీ అయ్యారు. జనసేన,టీడీపీ శ్రేణులు ఐక్యమత్యంగా పనిచేసేందుకు సహకారం అందించాలని బాబురావును కోరారు. అనంతరం ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి ఆత్మీయ సత్కారం చేశారు. ఈ సందర్భంగా బాబురావు సానుకూలంగా స్పందిస్తూ అన్ని విధాలా సహకరిస్తామని, కలిసికట్టుగా పనిచేసి వైసీపీని గద్దె దించుదామని అన్నారు. కార్యక్రమంలో బత్తుల వెంకటలక్ష్మి, కమిడి శ్రీరాం, నాయకులు పాల్గొన్నారు.

జనసేనలో చేరిక

రంగంపేట, జనవరి, 31: మండలంలోని మర్రిపూడిలో వైసీపీ నుంచి 15 మంది జనసేన పార్టీలో చేరారు. వారు బుధవారం జనసేన కోఆర్డినేటర్ రావాడ నాగు, మండలాధ్యక్షుడు గిరజాల సత్తిబాబు, యానాల కొండయ్య, ముంగి మురళీ సమక్షంలో జనసేనలో చేరగా వారికి నాగు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

యువకుడి అదృశ్యంపై ఫిర్యాదు

అనపర్తి, జనవరి 31: యువకుడి అదృశ్యంపై కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ రామారావు తెలిపారు. అనపర్తికి చెందిన కర్రి అరుణ్ సాయిదుర్గారెడ్డి హైదరాబాద్‌లో విద్యనభ్యసిస్తున్నాడు. ఇటీవల అనపర్తి వచ్చిన దుర్గారెడ్డి మంగళవారం మధ్యాహ్నం తన కారులో ఎవ్వరికీ చెప్పకుండా వెళ్లిపోయాడు. ఎంతసేపటికీ రాలేదు. ఫోన్ స్విచ్ఛాఫ్ రావడం, ఎంత వెదికినా ఫలితం లేకపోవడంతో బుధవారం పోలీసులను ఆశ్రయించారు. చింతా అనిల్ కుమార్‌రెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

చిరంజీవికి చంటియ్య శుభాకాంక్షలు



కడియం, జనవరి 31: ఇటీవల కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన పద్మవిభూషణ్ అవార్డు గ్రహీత, సినీ నటుడు చిరంజీవిని హైదరాబాదు ఆయన స్వగృహంలో బుధవారం సత్యదేవా నర్సరీ అధినేత పుల్లా చంటియ్య కలిశారు. బర్డ్‌నెస్ట్ ఫెర్న్ అనే మొక్కను ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు. సామాజిక సేవ, సినీ, రాజకీయ రంగాల్లో మచ్చలేని వ్యక్తిగా అందరి ఆదరాభిమానాలు పొందిన చిరంజీవికి పద్మవిభూషణ్ అవార్డును రావడం హర్షణీయమని చంటియ్య అన్నారు.

కార్పొరేషన్‌ల నిధులు ఏమయ్యాయి?

ప్రభుత్వంపై టీడీపీ నాయకులు ఆగ్రహం

గోకవరం, జనవరి 31: వైసీపీ ప్రభుత్వం అధికారం చేపట్టి సుమారు ఐదేళ్లు కావస్తున్నా ఎస్సీ, బీసీ, ఓసీ కార్పొరేషన్‌ల నిధులు ఇంతవరకూ ఏ ఒక్కరికీ మంజూరు చేయలేదని టీడీపీ నాయకులు విమర్శించారు. గోకవరంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాజీ జడ్పీటీసీ పాలూరి బోస్, సొసైటీ చైర్మన్ గాజింగం సత్తిబాబు, టీడీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శి గునుపే భరత్ మాట్లాడుతూ ఎస్సీ నిధులను దుర్వినియోగం చేయకూడదన్న సుప్రీంకోర్టు తీర్పును సీఎం జగన్ పెడ చెవిన పెట్టారన్నారు. అలాగే బీసీ, ఓసీ కార్పొరేషన్ నిధులను కూడా దారి మళ్లించారని ఆరోపించారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో ఎస్సీ, బీసీ, ఓసీ కార్పొరేషన్ నిధులను ఆయా లబ్ధిదారులకు అందుబాటులో ఉంచారన్నారు. గోకవరంలో స్థలాల కోసం ఎదురుచూస్తున్న లబ్ధిదారులకు వెంటనే స్థలాలను కేటాయించాలన్నారు. లేనిపక్షంలో ఆందోళనకు దిగుతామని హెచ్చరించారు. కోతులు, కుక్కల బెడద నుంచి రక్షించేందుకు సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో పలువురు టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

పల్ల వెంకన్న నర్సరీని సందర్శించిన సుధానారాయణమూర్తి



సుధా నారాయణమూర్తికి మొక్కను అందజేస్తున్న పల్ల వినయ్

కడియం, జనవరి 31: కడియంలో గ్రీన్ వరల్డ్ ఆవిష్కృతమైందని, అందుకు నర్సరీ రైతుల కృషి ప్రశంసనీయమని ఇన్ఫోసిస్ అధినేత, సంఘ సంస్కర్త సుధా నారాయణమూర్తి అన్నారు. బుధవారం పల్ల వెంకన్న నర్సరీని సందర్శించారు. నర్సరీ డైరెక్టర్ పల్ల వినయ్ మొక్కను అందజేసి స్వాగతించారు. నర్సరీని తిలకించిన సుధానారాయణమూర్తి తాను బెంగుళూరు, కలకత్తా, చెన్నై వంటి నగరాల్లో తిరిగినా గ్రీన్ లోకేషన్ చూడలేదన్నారు. ఆమె వెంట తహసీల్దారు ఎం.సుజాత ఉన్నారు.

యోగద సత్సంగ వార్షికోత్సవం

రాజమహేంద్రవరం కల్చరల్, జనవరి 31: గెయిల్ ఆఫీస్ సమీపంలోని యోగద సత్సంగ ధ్యాన మందిరంలో 22వ వార్షికోత్సవం ఘనంగా జరిగింది. యోగదా సభ్యులు, భక్తులు సామూహిక ధ్యాన కార్యక్రమంలో పాల్గొని శక్తి పూర్ణ అభ్యాసాలు, ప్రవచనాలు చేశారు. కీర్తనలు ఆలపించారు. అనంతరం ప్రసాద వితరణ జరిగింది. ఒక యోగి ఆత్మకథ రచయిత శ్రీశ్రీ పరమహంస యోగానంద స్థాపించిన యోగద సత్సంగ సొసైటీ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఈ వేడుకలు జరిగాయి.

రాష్ట్ర స్థాయి పోటీలకు అంకిత ఎంపిక



పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థినులతో హెచ్‌ఎం

అనపర్తి, జనవరి 31: ఇటీవల కాకినాడలో నిర్వహించిన స్కూల్ గేమ్స్ టెన్నికాయిట్ జిల్లా ఎంపికల్లో పాల్గొని తమ విద్యార్థిని రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్టు అనపర్తి జడ్పీ బాలికోన్నత పాఠశాల హెచ్‌ఎం కర్రి కళ్యాణి తెలిపారు. రాష్ట్ర స్థాయికి ఎంపికైన ఎనిమిదో తరగతి విద్యార్థిని బి.అంకిత ఈనెల 3నుంచి 5వరకు ఏలూరు జిల్లా జంగారెడ్డిగూడెంలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొనునుందని చెప్పారు. అలాగే ఇటీవల విజయవాడలో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో పదో తరగతి విద్యార్థిని ఎన్.శిరీషా మంగాదేవి విశేష ప్రతిభ కనబరిచి కప్పు సాధించినట్టు హెచ్‌ఎం తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థినులను, పీఈటీ ఎ.రాజేశ్వరిని ఆమె అభినందించారు.

సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాలలో ఇంటర్‌లో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

అనపర్తి, జనవరి 31: అనపర్తి శివారు కొత్తూరులోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సెంటినరీ సాంఘిక సంక్షేమ గురుకుల బాలుర జూనియర్ కళాశాలలో 2024-25 విద్యా సంవత్సరానికి ఇంటర్‌లో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ప్రిన్సిపాల్ చింతా మధుసూదనరావు తెలిపారు. బుధవారం కళాశాలలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎంపీసీలో 80సీట్లు, బైపీసీలో 80 సీట్లు అందుబాటులో ఉన్నాయని పూర్తిగా ఆంగ్ల మాధ్యమంలో బోధన జరుగుతుందన్నారు. ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులను డౌన్‌లోడ్ చేసుకోవచ్చని లేదా స్వయంగా కళాశాలలో దరఖాస్తు చేసకోవచ్చని ఆయన తెలిపారు. 2024లో పదో తరగతి పరీక్షల్లో పాల్గొనే వారు మాత్రమే అర్హులని చెప్పారు. మార్చి 10వ తేదీన ప్రవేశ పరీక్ష నిర్వహిస్తామని, జిల్లాలో ఎంపిక చేసిన కేంద్రాల్లో విద్యార్థులు పరీక్షలకు హాజరుకావలసి ఉంటుందన్నారు. పూర్తి వివరాలకు కళాశాల పనివేళల్లో సంప్రదించవచ్చని ప్రిన్సిపాల్ తెలిపారు.

గంటాలమ్మకు ప్రత్యేక పూజలు

కోరుకొండ, జనవరి31: కోరుకొండ 7 సంఘాల గ్రామదేవత మాతృశ్రీ గంటాలమ్మ జాతర ముగింపు సందర్భంగా బుధవారం ప్రత్యేక పూజలు, అర్చనలు నిర్వహించారు. జనసేన పార్టీ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా కోఆర్డినేటర్ బత్తుల వెంకటలక్ష్మి అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. అనంతరం జరిగిన అన్నసమారాధనలో పాల్గొని భక్తులకు అన్నప్రసాదాలు అందజేశారు. తదుపరి పేదలకు చీరలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆలయ అనువంశిక ధర్మకర్త మాతా సీతారాముడు, తాటికొండ రామకృష్ణ, మాతా ప్రభ, ముమ్మిడివరపులక్ష్మణరావు, బత్తుల గోపాలకృష్ణ, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

రహదారి నిబంధనలు పాటించాలి

కొవ్వూరు, జనవరి 31: రహదారి నిబంధనలు తూ.చా తప్పకుండా పాటించి రోడ్డు ప్రమాదాల నివారణకు పాటుపడాలని కొవ్వూరు ఎంవీఐ బి.స్వర్ణ శ్రీనివాస్ నాయక్ అన్నారు. రహదారి భద్రతా మాసోత్సవాల్లో భాగంగా కొవ్వూరు భాష్యం పాఠశాలలో బుధవారం నిర్వహించిన అవగాహనా సదస్సులో ఆయన మాట్లాడారు. లైసెన్సు లేకుండా వాహనాలు నడపడం వల్ల అధికంగా ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. వాహనాలు నడిపేటప్పుడు హెల్మెట్, సీటు బెల్ట్ ధరించాలన్నారు.

43 ఏళ్ల తర్వాత కలిశారు..



కడియం, జనవరి 31: వారంతా 1979-80లో భీమిలిలో ఉపాధ్యాయ శిక్షణా సంస్థలో కలిసి చదువుకున్నారు. కడియంకు చెందిన వారి మిత్రుడు వై.రాజేంద్రప్రసాద్ ఆధ్వర్యంలో బుధవారం బుర్రిలంకలోని గోకుల్ నర్సరీలో కలిశారు. శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్టణం, తుని, చోడవరం, అనకాపల్లి, తణుకు, రాజమహేంద్రవరం ప్రాంతాల నుంచి వచ్చిన మిత్రులు ఒకరినొకరు యోగక్షేమాలు తెలుసుకున్నారు. ఆనాటి సంగతులు గుర్తు చేసుకుని ఆనందంగా గడిపారు. కార్యక్రమానికి పాటంశెట్టి సూరిబాబు, తానంకి రాధాకృష్ణ, ఎస్.అబ్బిరాజు, జేజేఎస్ ప్రసాద్‌బాబు, శివప్రకాష్, వి. భానోజీరావు, సరళాదేవి తదితరులు హాజరయ్యారు.

ANDHRAJYOTHY

ఆంధ్రజ్యోతి

తూర్పుగోదావరి

జిల్లా వార్తలు

గురువారం 1 ఫిబ్రవరి 2024 | 5



'ఆంధ్రజ్యోతి' చొరవతో వృద్ధుడికి వైద్యం 8లో

నిర్లక్ష్యం వహించిన వైద్యులపై కలెక్టర్ సీరియస్

ఉన్నత విద్యలో

మరింత పురోగతి దిశగా..

నన్నయ యూనివర్సిటీ స్నాతకోత్సవంలో గవర్నర్ అబ్దుల్‌నజీర్



నన్నయ విశ్వవిద్యాలయ అధికారులతో గవర్నర్ అబ్దుల్‌నజీర్



స్నాతకోత్సవానికి హాజరైన గవర్నర్, ఇతర ముఖ్య అతిథులు



మాట్లాడుతున్న రాష్ట్ర గవర్నర్ అబ్దుల్‌నజీర్



నైనాజైస్వాల్‌కు పీహెచ్‌డీ ప్రదానం

వీసీ పద్మరాజు

గవర్నర్‌కు సత్కారం

విద్యార్థికి పట్టా అందిస్తున్న గవర్నర్

దివాన్‌చెరువు/రాజానగరం, జనవరి 31 : ఉన్నత విద్యలో 2035 నాటికి స్థూల నమోదు నిష్పత్తిని 50 శాతం పెంచడమే జాతీయ విద్యా విధానం-2020 లక్ష్యమని రాష్ట్ర గవర్నర్, నన్నయ విశ్వ విద్యాలయ కులపతి ఎస్.అబ్దుల్ నజీర్ అన్నారు. ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం 13,14,15 ఉమ్మడి స్నాతకోత్సవం బుధవారం వర్సిటీలోని ఎన్టీఆర్ కన్వెన్షన్ భవనంలో బుధవారం జరిగింది. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన గవర్నర్ మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా 900 విశ్వ విద్యాలయాలు, 40 వేల కళాశాలలతో ఉన్నత విద్యావిధానంలో భారతదేశం అతిపెద్ద నెట్‌వర్క్ కలిగి ఉందన్నారు. కానీ ఉన్నత విద్య స్థూల నిష్పత్తిలో మన దేశం కేవలం 27.29 శాతం మాత్రమే ఉందన్నారు. రానున్న 15 ఏళ్లలో ఉన్నత విద్యలో అరుదైన భాగస్వామ్యాన్ని రెట్టింపు చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వాలు ముందుకెళుతున్నాయన్నారు. జాతీయ విద్యా విధానానికి అనుగుణంగా సంపూర్ణ విద్యను మన రాష్ట్రం కూడా ప్రవేశపెట్టిందని చెప్పారు. నేడు ప్రపంచం వాతావరణ మార్పులతో తీవ్రమైన ముప్పును ఎదుర్కోంటుందని చెప్పారు. పర్యావరణ కాలుష్యం అనూహ్య వాతావరణ మార్పులకు దారితీస్తోందన్నారు. భూమి ప్రతి మనిషి అవసరాలను తీరుస్తుందని కాని వారి దురాశలను కాదని పూజ్య బాపూజీ చెప్పిన సూక్తిని గవర్నర్ వివరించారు. విద్యావంతులైన గ్రాడ్యుయేట్లు, యువకులతో 2047 నాటికి భారతదేశం స్థిరమైన అభివృద్ధిని సాధించే దిశగా పయనింపచేయాలన్నారు. మన దేశం స్వాతంత్ర్య శతాబ్ది ఉత్సవాలను జరుపుకోనున్న 2047 నాటికి సమాజంలోని అన్ని అసమానతలను రూపుమాపాలన్నారు. ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం నుంచి పట్టాలు పొందిన విద్యార్థులు దేశ గొప్ప సంప్రదాయాలను నిలబెట్టే దిశగా కృషి చేస్తారని, చదువుకున్న విశ్వవిద్యాలయానికి సమాజంలో కీర్తిప్రతిష్టలు తీసుకొస్తారని విశ్వసిస్తున్నానన్నారు. నన్నయ ఉపకులపతి ఆచార్య కె.పద్మరాజు, రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్ ఆచార్య కె.హేమచంద్రారెడ్డి, రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్, విశ్వవిద్యాలయ అధికారులు పి.సురేష్‌వర్మ, వై.శ్రీనివాసరావు, కె.శ్రీరమేష్, ఎమ్మెల్యే జక్కంపూడి రాజా, రాష్ట్ర గృహ నిర్మాణ సంస్థ చైర్‌పర్సన్ మేడపాటి షర్మిళారెడ్డి, చైతన్య విద్యాసంస్థల చైర్మన్ కేవీవీ సత్యనారాయణరాజు(చైతన్యరాజు), ఆదిత్య విద్యాసంస్థల చైర్మన్ ఎన్.శేషారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సంస్కృతిని పరిరక్షించాలి
ఇన్ఫోసిస్ చైర్‌పర్సన్ సుధామూర్తి

స్నాతకోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరైన ఇన్ఫోసిస్ చైర్‌పర్సన్ సుధామూర్తి మాట్లాడుతూ మాతృభాషను తప్పక గౌరవించాలని, అలాగే సంస్కృతి, సంప్రదాయాలను పరిరక్షించాలన్నారు. ఇతరుల దయాగుణం కలిగి ఉండాలని, ఆపదలో ఉన్న వారిని ఆదుకోవాలని చెప్పారు. మాతృదేవోభవ, పితృదేవోభవ, ఆచార్యదేవోభవ, అతిథి దేవోభవ అనే సూక్తిని విద్యార్థులంతా ఆచరించాలన్నారు. అలాగే ఉపనిషత్తులు, విష్ణు పురాణాల్లోని నీతి ధర్మాలను వివరించారు. విశ్వంలో ప్రతీ జీవరాశి పట్ల దయ, ప్రేమ కలిగి ఉండాలని కోరారు.

పట్టాలు ప్రదానం

దివాన్‌చెరువు/రాజానగరం, జనవరి 31: ఆదికవి నన్నయ విశ్వ విద్యాలయం 13,14,15 ఉమ్మడి స్నాతకోత్సవం సందర్భంగా ఇన్ఫోసిస్ చైర్‌పర్సన్ సుధామూర్తికి గౌరవ డాక్టరేట్‌ను, రాష్ట్ర తెలుగు సంస్కృత అకాడమీ చైర్‌పర్సన్ నందమూరి లక్ష్మీ పార్వతికి డి.లిట్‌ను, ఎంఏ సోషల్ వర్క్‌లో జక్కంపూడి రామ్మోహనరావు ఫౌండేషన్ ఎండోమెంట్ గోల్డ్ మెడల్‌ను 2021కి గానూ జక్కంపూడి విజయలక్ష్మికి రాష్ట్ర గవర్నర్, కులపతి ఎస్.అబ్దుల్ నజీర్ ప్రదానం చేశారు. అలాగే టేబుల్ టెన్నిస్ క్రీడాకారిణి నైనా జైస్వాల్‌కు గవర్నర్ మేనేజ్‌మెంట్ స్టడీస్‌లో పీహెచ్‌డీ ప్రదానం చేశారు. విశ్వవిద్యాలయంలోని ఎన్టీఆర్ కన్వెన్షన్ సెంటర్‌లో బుధవారం జరిగిన స్నాత కోత్సవంలో దరఖాస్తు చేసుకున్న 500 మందిలో పీహెచ్‌డీ 12, బంగారు పతకాలు 12, ప్రైజులు 12 అందజేశారు. మిగిలిన వారిలో ఎంఏ, ఎంకామ్, ఎంబీఏ, ఎల్ఎల్ఎం, ఎమ్మెస్సీ, ఎంసీఏ, ఎంఈడీ, ఎల్ఎల్‌బీ, బీఈడీ వంటి కోర్సులు పూర్తిచేసిన వారికి సర్టిఫికెట్లు అందజేశారు. మూడు విద్యా సంవత్సరాల్లో విశ్వవిద్యాలయం, అనుబంధ కళాశాలల్లో పీజీ పూర్తి చేసిన 8582 మంది, అండర్ గ్రాడ్యుయేషన్ పూర్తి చేసిన 50,173 మంది విద్యార్థులకు పట్టాలు ఆమోదించారు. ఆర్థిక శాఖ సంయుక్త సలహాదారు డి.సురేంద్ర, రాష్ట్ర తెలుగు సంస్కృత అకాడమీ చైర్‌పర్సన్ నందమూరి లక్ష్మీపార్వతి, ఈసీ సభ్యులు పి.విజయనిర్మల, కె.నూకరత్నం, జ్యోతి, ఎం.వసంతలక్ష్మి, షేక్ సులేమాన్, జి.నారాయణరావు, జి.రాజకుమార్, వై.సత్యనారాయణ, డీన్లు కెవిఎస్ రమేష్, పి.సురేష్‌వర్మ, వై.శ్రీనివాసరావు, కె.రమణేశ్వరి, ఎమట్టారెడ్డి, ప్రిన్సిపాల్స్ డి.జ్యోతిర్మయి, పి.వెంకటేశ్వరరావు, కె.సుబ్బారావు, ఎస్.ప్రశాంతిశ్రీ, టి.అశోక్, డైరెక్టర్ వి.పెర్సిస్, సీఈ ఎస్.లింగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రజల అభివృద్ధితోనే..

దేశాభివృద్ధి

- రాష్ట్ర గవర్నర్, జేఎన్‌టీయూకే కులపతి ఎస్.అబ్దుల్ నజీర్
- ఘనంగా కాకినాడ జేఎన్టీయూకే పదో స్నాతకోత్సవం
- ముఖ్యఅతిథిగా మాజీ నేవీ రియర్ అడ్మిరల్ వెంకటశేషాచారి
- టీసీఎస్ ప్రెసిడెంట్ వి.రాజన్నకు గౌరవ డాక్టరేట్ ప్రదానం
- 64 పీహెచ్‌డీ అవార్డులు, 28 బంగారు పతకాలు ప్రదానం



జేఎన్‌టీయూకే స్నాతకోత్సవంలో మాట్లాడుతున్న రాష్ట్ర గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్



వి.రాజన్నకు గౌరవ డాక్టరేట్‌ను ప్రదానం చేస్తున్న గవర్నర్ అబ్దుల్‌నజీర్

జేఎన్టీయూకే, జనవరి 31: ప్రజల అభివృద్ధితోనే దేశం అభివృద్ధి చెందుతుందని రాష్ట్ర గవర్నర్, జేఎన్‌టీయూకే కులపతి ఎస్.అబ్దుల్ నజీర్ అన్నారు. వర్సిటీలోని అలూమ్ని ఆడిటోరియంలో కాకినాడ జేఎన్టీయూకే పదో స్నాతకోత్సవాన్ని బుధవారం ఉదయం 11గంటలకు గవర్నర్ అధ్యక్షతన ప్రారంభించారు. ఈ వేడుకలకు మాజీ నేవీ రియర్ అడ్మిరల్ ఎస్.వెంకటశేషాచారి ముఖ్యఅతిథిగా విచ్చేయగా టీసీఎస్ టెక్నాలజీ, సాఫ్ట్‌వేర్ సర్వీసెస్ ప్రెసిడెంట్ వి.రాజన్నకు గౌరవ డాక్టరేట్‌ను ప్రదానం చేశారు. జేఎన్టీయూకే ఉపకులపతి జీవీఆర్ ప్రసాదరాజు, ఏపీఎస్సీహెచ్ఈ చైర్మన్ కె.హేమచంద్రారెడ్డి, డైరెక్టర్లు, ఈసీ సభ్యులు, ప్రిన్సిపాల్స్ వేదికను అలంకరించారు. ఈ కార్యక్రమానికి అతిథులు, పీహెచ్‌డీ అవార్డు గ్రహీతలు, బంగారు పతక విజేతలు స్నాతకోత్సవ సంప్రదాయ వస్త్రధారణలో విచ్చేశారు.



మాట్లాడుతున్న ఎస్.వెంకటశేషాచారి



మాట్లాడుతున్న ఉపకులపతి ప్రసాదరాజు





గవర్నర్ నుంచి పీహెచ్‌డీ అందుకుంటున్న ఎం.జయ, బంగారు పతకం అందుకుంటున్న ఎస్ఎస్.శ్రీసాగరి

గవర్నర్ అబ్దుల్‌నజీర్ మాట్లాడుతూ పీహెచ్‌డీ అవార్డు గ్రహీతలు, బంగారు పతకాలు సాధించిన విద్యార్థులను ప్రత్యేకంగా అభినందించారు. జేఎన్టీయూకే న్యాక్‌ఏ+ గ్రేడ్, యూసీఈకే ఎన్‌బీఏ గుర్తింపు సాధించినందుకు వర్సిటీ అధికారులను ప్రశంసించారు. స్వామి వివేకానంద మాటలను గుర్తుచేశారు. ఒక ఆలోచనను స్వీకరించి దాన్ని తమ జీవితంగా చేసుకోవాల ని దాని గుర్చే ఎల్లపుడూ ఆలోచిస్తూ కలలు కంటూ లక్ష్యాన్ని సాధించాలన్నారు. తమను తాము విశ్వసించాలని, తమ జ్ఞానం సామర్థ్యాలపై అత్యంత విశ్వాసం చూపాలని సూచించారు. ఉన్నతవిద్య విద్యార్థులకు నైతిక, రాజ్యాంగ విలువలు, కళలు, ఉత్సుకత, సాంకేతికత అధ్యయనం చేసేలా రూపొందించాలని కోరారు. వృత్తిపరంగా ప్రతిఒక్కరూ సమాజంకోసం కృషిచేయాలన్నారు. ఒక వ్యక్తి వ్యక్తిత్వాన్ని రూపుదిద్దడంలో విద్యాసంస్థల బాధ్యత ఎంతో ఉందన్నారు. అనంతరం ముఖ్యఅతిథి వెంకటశేషాచారి మాట్లాడుతూ విద్యార్థుల విజ్ఞానా న్ని పెంపొందించే పరిశ్రమలకోసం పరిశోధనాభివృద్ధి ప్రాజెక్టుల ను ప్రోత్సహించాలని కోరారు. దక్షిణ చైనా సముద్రంలోని పరిస్థితులు, రష్యా-ఉక్రెయిన్ల వివాదం, ఇజ్రాయిల్-హమాస్‌ల వివా దం కొనసాగే అవకాశం ఉన్నందున మన దేశ తయారీ రంగంలో అత్యాధునిక సాంకేతికతను తీసుకురావడానికి ఇది గొప్ప అవకాశమన్నారు. యువకులు పరిశోధన, అభివృద్ధి సహాయంతో యుద్ధనౌకల రూపకల్పనలో ముఖ్యభూమిక పోషించాలని కోరారు. వీసీ ప్రసాదరాజు మాట్లాడుతూ ఎన్ఈపీ 2020 ప్రకారం ఆర్23 సిలబస్‌ను రూపకల్ప న చేశామన్నారు. వర్సిటీ క్రీడా విభాగానికి కేంద్రం 400మీటర్ల సింథటిక్ అ థ్లెటిక్ ట్రాక్‌ను మంజూరు చేసిందని తెలిపారు. వర్సిటీ పరిధిలోని 22ఇంజనీ రింగ్, ఫార్మసీ కళాశాలలు 2023-24నుంచి స్వయంప్రతిపత్తి పొందాయన్నారు. విశ్వవిద్యాలయం సైన్స్, టెక్నాలజీ, ఇంజనీరింగ్, గణిత విభాగాల్లో విద్యను ప్రో త్సహించేందుకు వినూత్న కోర్సులందించే చర్యలు చేపడుతున్నామన్నారు.



గవర్నర్‌తో కలిసి స్నాతకోత్సవంలో పాల్గొన్న అతిథులు

అవార్డులు, పతకాలు ప్రదానం

స్నాతకోత్సవంలో 64మందికి పీహెచ్‌డీ అవార్డులు, 21మందికి బంగారు పతకాలను గవర్నర్, వీసీ ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఈసీ సభ్యులు, రెక్టార్ కేవీ రమణ, రిజిస్ట్రార్ సుమలత, మాజీ వీసీలు తులసీరామ్‌దాస్, కుమార్, శ్రీనివాస్‌కుమార్, మాజీ ఏపీపీఎస్సీ చైర్మన్ ఉదయ్‌భాస్కర్, శేషారెడ్డి, కృష్ణారావు, చైతన్యరాజు, ఈసీ సభ్యులు ఎస్.చంద్రశేఖర్, బీవీవీ సత్యనారాయణ, ఆమీనాబి, సతీష్‌రెడ్డి, డైరెక్టర్లు సీహెచ్‌సాయిబాబు, వి.రవీంద్ర, బి.బాలకృష్ణ, ఏ.గోపాలకృష్ణ, బీటీకృష్ణ, మురళీకృష్ణ, శ్రీనివాసులు, కృష్ణమోహన్ బాలాజీ, ప్రిన్సిపాల్ కృష్ణప్రసాద్, రత్నకుమారి, హరిత, పీహెచ్‌డీ గ్రహీతలు, విద్యార్థులు పాల్గొన్నారు. సాయంత్రం విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.



సాంస్కృతిక ప్రదర్శనలు ఇస్తున్న విద్యార్థినులు

రాజమహేంద్రవరం కార్పొరేషన్ ఎన్నికలు జరిపించలేని స్థితిలో వైసీపీ ప్రభుత్వం

- ఓటమి భయంతోనే ఎన్నికలకు దూరం
- ఎంపీ భరత్ చేసిందేమీ లేదు
- ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి



రాజమహేంద్రవరం, జనవరి 31(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికలు జరిపించలేని దారుణ స్థితిలో వైసీపీ ఉందని, ఓటమి భయంతోనే ఎన్నికలు నిర్వహించలేదని టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు, రాజమహేంద్రవరం రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి ధ్వజమెత్తారు. స్థాని కంగా తన స్వగృహంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. సర్పంచులు, జడ్పీటీసీలు చనిపోయిన స్థానాల్లో కూడా ఎన్నికలు పెట్టడానికి వైసీపీకి ఓటమి భయం పట్టుకుందన్నారు. తెలుగుదేశం సభ విజయవంతం కావడంతో బాకా బాబు అయిన ఎంపీ భరత్ ఉలికిపడిపోతున్నారని, గుడిని, గుడిలో లింగాన్ని కూడా మింగేస్తున్నారని ఆరోపించారు. రాజమహేంద్ర వరానికి తానే సృష్టి కర్త అనే విధంగా బాకా ఊదేస్తున్నారని, బావిలో కప్ప తనకు అదే ప్రపంచం అనుకుంటుందని ఎద్దేవా చేశారు. ఎన్నో కబుర్లు చెప్పారని, రింగ్‌రోడ్డని, స్టేడియం అని అని అన్నారు. ఎంపీ మురళీ మోహన్ 5 ఫ్లైవోవర్ బ్రిడ్జిలు శాంక్షన్ చేయిస్తే, వాటిని రద్దు చేయించి, ఒకటి కడుతున్నారని అదైనా ఎప్పటికి పూర్తవుతుందో తెలియదని ఎద్దేవా చేశారు. ఆవ భూముల కుంభకోణం జరిగిందని, ఒక పట్టా కూడా ఇవ్వలేదని ఆయన విమర్శించారు. అసలు వైసీపీ ప్రభుత్వం నుంచి రాజమహేంద్రవరం అభివృద్ధికి నిధులెన్ని తెచ్చావో శ్వేతపత్రం ప్రకటించాలని ఆయన ఎంపీడీని డిమాండ్ చేశారు. రామచంద్రపురంలో చెల్లని మంత్రి, రాజ మహేంద్రవరం రూరల్‌లో ఎలా చెల్లిపోతారని ఆయన ఎద్దేవా చేశారు.

ఎంపీ భరత్ పెర్ఫార్మెన్స్ అందరికీ తెలుసు

టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ ఆదిరెడ్డి వాసు



సమావేశంలో మాట్లాడుతున్న ఆదిరెడ్డి వాసు

రాజమహేంద్రవరం సిటీ, జనవరి 31: రీల్ స్టార్ ఎంపీ భరత్ పెర్ఫార్మెన్స్ ఏమిటో పార్లమెంట్‌లో అందరికీ తెలుసని టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ ఆదిరెడ్డి వాసు అన్నారు. రాజమహేంద్రవరం ప్రెస్‌క్లబ్‌లో బుధవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పార్లమెంట్‌లో తాను ఎక్కువ శాతం డిబేట్‌లో పాల్గొనలేదని నిరూపిస్తే రాజీనామా చేస్తామని చెప్పిన భరత్ చిట్టా తన వద్ద ఉందని, అతను ఎపుడు రాజీనామా చేస్తాడో చెప్పాలని ఆదిరెడ్డి వాసు ప్రశ్నించారు. పార్లమెంట్‌లో తాను మాత్రమే మాట్లాడుతున్నానని రాష్ట్రావసరాలను తానే లేవనెత్తుతున్నానని, తాను కష్టపడిన దానిలో 50 శాతం మరే ఎంపీ అయినా కష్టపడుతున్నాడా ? అంటూ భరత్ అనడం హాస్యాస్పదంగా ఉందన్నారు. వాస్తవానికి పార్లమెంట్‌లో జరిగిన డిబేట్స్‌లో శ్రీకాకుళం ఎంపీ కింజరాపు రామ్మోహననాయుడు 80 శాతం డిబేట్స్‌లో పాల్గొంటే కాకినాడ ఎంపీ వంగా గీత 75 డిబేట్స్‌లో పాల్గొన్నారని, రీల్ స్టార్ రాజమహేంద్రవరం ఎంపీ భరత్ కేవలం 46 డిబేట్స్‌లోనే పాల్గొన్నారని చెప్పారు. ఎంపీ నిధుల వినియోగం విషయానికి వస్తే ఎంపీ రామ్మోహననాయుడు 89 శాతం నిధులు వినియోగించుకున్నారని, భరత్‌రామ్ మాత్రం కేవలం 62 శాతం నిధులు వినియోగించుకున్నారని చెప్పారు. మరోపక్క రాష్ట్ర ప్రభుత్వం నుంచి నిధులు తీసుకురావడం చేతకాదని నగర పాలక సంస్థ నిధులను దుర్వినియోగం చేస్తూ ప్రజల సొమ్మును తన బిల్డప్ కోసం వాడుకుంటున్నాడని ధ్వజమెత్తారు. టీడీపీ హయాంలో పోలవరం పనులు 72 శాతం పూర్తయితే వైసీపీ ప్రభుత్వం కేవలం 4 శాతం మాత్రమే పూర్తి చేసిందని మండిపడ్డారు. టీడీపీ హయాంలో నగరంలో టెన్నిస్ కోర్టు, ఆర్ట్స్ కళాశాల మైదానంలో రన్నింగ్ ట్రాక్, స్కేటింగ్ రింగ్ వంటివన్నీ పూర్తి చేసామని, అయితే వాటిపై భరత్‌రామ్ బిల్డప్ వ్యాఖ్యలు చేస్తున్నారని, భరత్‌రామ్ చేసేవన్నీ చిల్లర రాజకీయాలని మండిపడ్డారు. దమ్ముంటే జగన్‌ను రాజమండ్రిలో పోటీకి దింపండి..డిపాజిట్లు కూడా రావన్నారు. ఇప్పటికే జగన్‌కు సన్‌స్ట్రోక్ మాదిరిగా సిస్టర్ స్ట్రోక్ తగిలిందని జగనన్న బాణమే జగన్‌కు తిరిగి గుచ్చుకుంటుందని చమత్కరించారు. ఈ సమావేశంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కాశి నవీన్‌కుమార్, టీఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వర్రే శ్రీనివాసరావు, టీడీపీ నగర అధ్యక్షుడు రెడ్డి మణి, ప్రధాన కార్యదర్శి బుడ్డిగ రాధా, కార్యదర్శి లాల్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

సమన్వయంతోనే గ్రామాభివృద్ధి

ఉండ్రాజవరం సర్వసభ్య సమావేశంలో ఎంపీపీ యల్లారీశ్వరి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ యల్లారీశ్వరి

ఉండ్రాజవరం, జనవరి 31: గ్రామాల్లో అధికారులు, ప్రజాప్రతినిధుల సమన్వయంతో అభివృద్ధి జరగాలని ఎంపీపీ పాలాటి యల్లారీశ్వరి అన్నారు. బుధవారం మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో ఆమె మాట్లాడారు. జడ్పీటీసీ సభ్యుడు నందిగం భాస్కరరామయ్య మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలపై ప్రజలకు మరింత సమాచారం అందజేయాలని అధికారులు, ప్రజాప్రతినిధులకు సూచించారు. నాడు-నేడు పనులు వేగంగా జరుగుతున్నట్టు ఎంఈవో సక్సేనరాజు తెలిపారు. మండలంలో విద్యుత్ లైన్‌మెన్‌ల కొరత ఉందని ఏఈ దొరబాబు సభ దృష్టికి తీసుకురాగా ఈసమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళతామని ఎంపీపీ యల్లారీశ్వరి అన్నారు. ఈ సందర్భంగా వివిధ శాఖల అధికారులు తమ ప్రగతిని వివరించారు. కార్యక్రమంలో ఎంపీడీవో జవీఎస్‌కె రాజు, వైస్ ఎంపీపీ ఎస్.సరోజ, అధికారులు, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

ఆరోగ్యాన్ని సంరక్షించుకోవాలి

కొవ్వూరు, జనవరి 31: ఆరోగ్య సురక్షా శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకుని ఆరోగ్యాన్ని సంరక్షించుకోవాలని కొవ్వూరు యూహెచ్‌సీ డాక్టర్ తిరువీదుల సుష్మ అన్నారు. స్థానిక 3వ సచివాలయం పరిధిలోని మద్దిపట్ల వారివీదిలో బుధవారం ఆరోగ్య సురక్షా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ శిబిరంలో గైనకాలజిస్టు డాక్టర్ ఆదిత్య, జనరల్ మెడిసిన్ డాక్టర్ రవికాంత్, వైద్య సిబ్బంది 200 మందిని పరీక్షించి, మందులు పంపిణీ చేశారు. బీపీ, షుగర్, కంటి పరీక్షలు చేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్ మద్దిపట్ల సాయిగీత, మున్సిపల్ కమిషనర్ బి.శ్రీకాంత్, అప్తామెట్రిషియన్ టి.ఆనంద్, ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.

ఎలుకల నివారణకు చర్యలు తీసుకోవాలి



రైతులకు ఎలుకల మందు పంపిణీ చేస్తున్న ఏడీఏ చంద్రశేఖర్

కొవ్వూరు, జనవరి 31: రైతులు ఎలుకల నివారణకు జాగ్రత్త చర్యలు పాటించాలని కొవ్వూరు ఏడీఏ పి.చంద్రశేఖర్ అన్నారు. సామూహిక ఎలుకల నివారణలో భాగంగా కొవ్వూరు మండలం దొమ్మేరు రైతు భరోసా కేంద్రం వద్ద బుధవారం రైతులకు మందును పంపిణీ చేశారు. బ్రోమోడయాలిన్ 0.25శాతం, ఎర 10గ్రాములు చొప్పున పొట్లాలుగా కట్టి ఎలుక కన్నాల్లో ఉంచాలన్నారు. మందు తిన్న ఎలుకలు నాలుగు రోజుల తర్వాత రక్తస్రావమై చనిపోతాయి. పంట పొలాలతో పాటు, కొబ్బరితోటల్లో ఈ మందు వాడవచ్చునన్నారు.

రహదారి నిబంధనలు పాటించాలి

కొవ్వూరు, జనవరి 31: రహదారి నిబంధనలు తూ.చా తప్పకుండా పాటించి రోడ్డు ప్రమాదాల నివారణకు పాటుపడాలని కొవ్వూరు ఎంవీఐ బి.స్వర్ణ శ్రీనివాస్ నాయక్ అన్నారు. రహదారి భద్రతా మాసోత్సవాల్లో భాగంగా కొవ్వూరు భాష్యం పాఠశాలలో బుధవారం నిర్వహించిన అవగాహనా సదస్సులో ఆయన మాట్లాడారు. లైసెన్సు లేకుండా వాహనాలు నడపడం వల్ల అధికంగా ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. సెల్‌ఫోను మాట్లాడుతూ, మద్యం తాగి వాహనాలు నడపడం ప్రమాదకరమని, వాహనాలు నడిపేటప్పుడు హెల్మెట్, సీటు బెల్ట్ ధరించాలన్నారు. కార్యక్రమంలో ఏఎంవీఐ ఎండీ జమీర్, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ముక్కామలలో దోబీఘాట్‌కు శంకుస్థాపన

పెరవలి, జనవరి 31: ముక్కామలలో రజకులకు సంబంధించి దోబీ ఘాట్‌కు ఎమ్మెల్యే శ్రీనివాసనాయుడు బుధవారం శంకుస్థాపన చేశారు. సుమారు రూ.10 లక్షల వ్యయంతో ఈ ఘాట్‌ను నిర్మించనున్నారు. కార్యక్రమంలో ఎంపీపీ కార్చెర్ల ప్రసాద్, వైసీపీ నాయకులు, ప్రజాప్రతినిధులు అధికారులు పాల్గొన్నారు.

ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్‌ను రద్దు చేయాలి



చాగల్లులో నిరసన తెలుపుతున్న న్యాయవాదులు

చాగల్లు, జనవరి 31: ప్రజావ్యతిరేక ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్‌ను రద్దు చేయాలని కోరుతూ చాగల్లులో న్యాయవాదులు నిరసన తెలిపారు. నిడదవోలు బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో సీనియర్ న్యాయవాదులు పాల్గొని ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్‌ను రద్దు చేయాలని నినాదాలు చేశారు. ప్రజలకు అవగాహన కలిగేలా చట్టం వల్ల కలిగే నష్టాలను వివరించారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎం.రవికుమార్, ఎస్.సత్యనారాయణ, డి.రవిశంకర్, ఎం.అర్జునుడు, కోడి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఇంజనీరింగ్‌లో జయసురేఖకు గోల్డ్‌మెడల్



గవర్నర్‌చేతుల మీదుగా డిగ్రీ పట్టా అందుకుంటున్న జయసురేఖ

ఉండ్రాజవరం, జనవరి 31: ఉండ్రాజవరం గ్రామానికి చెందిన ఆళ్ల జయసురేఖ ఇంజనీరింగ్‌లో గోల్డ్‌మెడల్ సాధించింది. కాకినాడ జేఎన్‌టీయూలో 2019-2023లో బీటెక్ ఈఈఈ పూర్తి చేసిన ఆమె బుధవారం కాకినాడలో జరిగిన విశ్వవిద్యాలయం పదో స్నాతకోత్సవంలో రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ చేతుల మీదుగా గోల్డ్‌మెడల్ పొందారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇండియన్ ఇంజనీరింగ్ సర్వీసను సాధించడమే లక్ష్యమని చెప్పారు. కాగా సురేఖ తండ్రి ఉండ్రాజవరం హైస్కూల్లో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నారు. ఇంజనీరింగ్‌లో గోల్డ్‌మెడల్ సాధించడం పట్ల పలువురు ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయులు ఆమెను అభినందించారు.

గుంటూరు రోడ్డు ప్రమాదంలో తీపర్రు వాసి మృతి

పెరవలి, జనవరి 31: గుంటూరు సమీపంలో చెన్నై-కలకత్తా జాతీయ రహదారిపై బొడంపాడు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో తూర్పుగోదావరి జిల్లా పెరవలి మండలం తీపర్రుకు చెందిన ర్యాలి వీరాంజనేయులు(36) అక్కడికక్కడే మృతి చెందాడు. వివరాలిలా ఉన్నాయి.. వీరాంజనేయులు కోళ్లకు గావు(మెస్)లు తయారు చేసి విక్రయిస్తుంటాడు. ఉండ్రాజవరం మండలం చివటం గ్రామానికి చెందిన ఒక వాహనంపై గావులు వేసుకుని వెళ్లి పని పూర్తి చేసుకుని తిరుగు ప్రయాణమయ్యారు. మంగళవారం అర్ధరాత్రి దాటిన అనంతరం జాతీయ రహదారిపై జరిగిన ఈ ప్రమాదంలో వీరాంజనేయులు మృతి చెందగా డ్రైవర్‌కు గాయాలయ్యాయి. పని కోసం వెళ్లిన వెలగదుర్రుకు చెందిన మరో ఇద్దరు యువకులకు కూడా స్వల్ప గాయాలయ్యాయి. మృత దేహాన్ని గుంటూరు ఆసుపత్రికి తరలించి పోస్టుమార్టం అనంతరం బంధువులకు అప్పగించారు.

తీపర్రులో విషాదఛాయలు..

వీరాంజనేయులు మృతితో తీపర్రులో విషాదఛాయలు అలుముకున్నాయి. చేతి వృత్తి చేసి కుటుంబాన్ని పోషించుకుంటున్న అతడికి భార్య నాగలక్ష్మి, ఒక అబ్బాయి, అమ్మాయి ఉన్నారు. పెద్ద దిక్కును కోల్పోయిన ఆ కుటుంబం కన్నీరు మున్నీరవుతోంది.

గవర్నర్‌కు ఘన స్వాగతం

దివాన్‌చెరువు, జనవరి 31: జిల్లా పర్యటనకు వచ్చిన రాష్ట్ర గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్‌కు హెలీప్యాడ్ వద్ద ఘన స్వాగతం లభించింది. కాకినాడలో పర్యటన ముగించుకుని హెలికాప్టర్‌లో గైట్‌లోని హెలీప్యాడ్‌కు బుధవారం మధ్యాహ్నం 1.10 గంటలకు చేరుకున్నారు. అక్కడ జిల్లా కలెక్టర్ కె.మాధవీలత, ఎస్పీ పి.జగదీష్, జేసీ ఎన్.తేజ్‌భరత్, నన్నయ వీసీ ఆచార్య కె.పద్మరాజు, ఆర్డీవో కె.చైత్రవర్షిణి, అడిషనల్ ఎస్పీ ఎస్ఆర్ శేఖరరాజు, చైతన్య విద్యాసంస్థల చైర్మన్ కేవీవీ సత్యనారాయణరాజు(చైతన్యరాజు), బీజేపీ నాయకుడు నీరుకొండ వీరన్నచౌదరి గవర్నర్‌కు ఘన స్వాగతం పలికారు.

ప్రభుత్వ కార్యక్రమాల్లో ప్రొటోకాల్ తప్పనిసరి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ పోసిరాజు

» తాళ్లపూడి సర్వసభ్య సమావేశంలో ఎంపీపీ పోసిరాజు

తాళ్లపూడి, జనవరి 31: ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాల అమలులో అధికారులు తప్పనిసరిగా ప్రొటోకాల్ పాటించాలని, సంక్షేమ పథకాలు సక్రమంగా అందజేయాలని ఎంపీపీ జొన్నకూటి పోసిరాజు పేర్కొన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఎంపీటీసీ వీరా హరిబాబు మాట్లాడుతూ మండలంలో అధికారులు, నాయకులు ప్రొటోకాల్ పాటించడం లేదన్నారు. గ్రామాల్లో దోమలు ప్రబలుతుంటే ప్రభుత్వం ఇచ్చిన ఫాగ్ మిషన్లు ఏమయ్యాయని ప్రశ్నించారు. దీంతో సభలో కొద్దిసేపు గందరగోళం నెలకొంది. ఈ సందర్భంగా పెద్దేవం కార్యదర్శి సువర్చల మాట్లాడుతూ ఫాగింగ్ మిషన్లు పనిచేడంలేదని, సర్పంచ్ ఆదేశాలు లేకుండా వాటిని బాగు చేయించలేమని బదులిచ్చారు. కొన్ని గ్రామాల్లో పనులు పూర్తయినా నూతన భవనాలు నేటికీ ప్రారంభం కాలేదన్న విషయంపై కూడా చర్చ జరిగింది. మండలంలో నూతనంగా మంజూరైన 235 ఇళ్ల స్థలాల్లో అన్నదేవరపేట గ్రామానికే 80స్థలాలు కేటాయించడం పట్ల వేగేశ్వరపురం సర్పంచ్ కొమ్మిరెడ్డి పరశురామారావు అధికారులను ప్రశ్నించారు. కాగా మలకపల్లి నుంచి ప్రక్కిలంక వరకూ రూ.4 కోట్లతో ఆర్‌అండ్‌బీ రోడ్డు నిర్మిస్తున్నట్టు ఆ శాఖ అధికారులు తెలిపారు. సమావేశంలో ఎంపీడీవో వెంకటరమణ, ఆర్.కిషోర్, వైస్ ఎంపీపీ కోదాటి కనకం, పలు గ్రామాల ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, ప్రభుత్వ శాఖల అధికారులు పాల్గొన్నారు.

నాణ్యమైన పొగాకును ఉత్పత్తి చేయాలి

» పొగాకు బోర్డు రీజనల్ మేనేజర్ ఆదిశేషయ్య



బంధపురంలో క్యూరింగ్ చేసిన పొగాకును పరిశీలిస్తున్న ఆదిశేషయ్య

దేవరపల్లి, జనవరి 31: పురుగు మందు అవశేషాలు లేని నాణ్యమైన పొగాకును ఉత్పత్తి చేయాలని పొగాకు బోర్డు రీజనల్ మేనేజర్ ఎం.ఆదిశేషయ్య రైతులకు సూచించారు. దేవరపల్లి పొగాకు వేలం కేంద్రం పరిధిలోని ధూమంతనగూడెం, రామన్నపాలెం, బంధపురం, కొత్తగూడెం, దుద్దుకూరు, చెరుకుమిల్లి గ్రామాల్లో బుధవారం పొగాకు తోటలను పొగాకు క్యూరింగ్ చేసే విధానాన్ని పొగాకుబోర్డు అధికారులు, పొగాకు కంపెనీ ప్రతినిధులు వివరించారు. ఈ సందర్భంగా ఆదిశేషయ్య మాట్లాడుతూ పొగాకు గ్రేడింగుల్లో అన్యపదార్థాలు లేకుండా చూసుకోవాలని, పొగాకు బోర్డు పరిధి మేరకే పంట పండించాలన్నారు. పొగాకు క్యూరింగ్ చేయడంలోనూ జాగ్రత్తలు తీసుకోవాలని, పక్వానికి వచ్చిన ఆకులనే తెంచి క్యూరింగ్ చేయాలన్నారు. దీని వలన నాణ్యమైన పొగాకు ఉత్పత్తి అవుతుందన్నారు. సీటీఆర్ఐ శాస్త్రవేత్త డాక్టర్ వై.సుబ్బయ్య మాట్లాడుతూ దేవరపల్లి పొగాకు వేలం కేంద్రం పరిధిలో ఉన్న పొగాకు పంటను పరిశీలించామని తోటలు బాగానే ఉన్నాయని ఉత్తమ యాజమాన్య పద్ధతులు పాటించి క్యూరింగ్, గ్రేడింగ్ చేయాలన్నారు. కార్యక్రమంలో పొగాకు బోర్డు వేలం నిర్వహణాధికారి జీఎల్‌కే ప్రసాద్, పొగాకు కంపెనీ ప్రతినిధులు రఘునాథరావు, సీతారామరాజు, శివకుమార్, రైతులు పాల్గొన్నారు.

బీమా సొమ్ముల కోసం..

చనిపోయినట్టు నాటకం



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్పీ కిషోర్‌కుమార్

» గుర్తుతెలియని మృతదేహం లభ్యం కేసును ఛేదించిన పోలీసులు

» ప్రధాన నిందితుడి సహా నలుగురి అరెస్టు

రంగంపేట, జనవరి, 31: బీమా సొమ్ములకు కక్కుర్తి పడి చనిపోయినట్టు నాటకమాడిన ఓ వ్యక్తితోపాటు అతడికి సహకరించిన నలుగురిని పోలీసులు అరెస్టు చేశారు. గత నెల 26న రంగంపేట మండలం పాతవీరంపాలెంలో పూర్తిగా కాలిపోయిన గుర్తుతెలియని మృతదేహం అంటూ దినపత్రికల్లో ఓ వార్త ప్రచురితమైంది. ఈ కేసుకు సంబంధించి బుధవారం రంగంపేట పోలీస్టేషన్‌లో రాజమహేంద్రవరం ఈస్ట్‌జోన్ డీఎస్పీ ఎం.కిషోర్‌కుమార్ పాత్రికేయుల సమావేశంలో మాట్లాడారు. సదరు ఘటనపై విచారణకు డీఎస్పీ ఎం.కిషోర్‌కుమార్, అనపర్తి సీఐ శివగణేష్ రెండు బృందాలుగా దర్యాప్తు చేపట్టారు. ఈ క్రమంలో చనిపోయాడనుకున్న కేతమళ్ళ వెంకటేశ్వరరావు(పూసయ్య) బతికున్నట్టు తెలుసుకుని అతడిని స్టేషన్‌కు పిలిపించి విచారించగా.. గత నెల 26న తెల్లవారుజామున తాను పొలంలోకి వెళ్తుండగా ముగ్గురు వ్యక్తులు ఆటోలో వచ్చి కేతమళ్ల గంగారావు పొలంలోని ట్రాన్స్‌ఫార్మర్ వద్ద ఓ శవాన్ని పడేసి నిప్పు అంటించడం చూసి వారిని వెంబడించి పట్టుకోవడానికి ప్రయత్నించగా వారు తనను గాయపరిచి అపస్మారక స్థితిలోకి వెళ్ళిన తర్వాత ఆటోలో ఎక్కించుకొని రాజమహేంద్రవరం రూరల్ మండలం పిడింగొయ్యి గ్రామంలోని పొలాల వద్ద వదిలేసి వెళ్లిపోయినట్టు చెప్పాడు. అయితే పోలీసులు సీసీ కెమెరా ఫుటేజ్, సాంకేతిక ఆధారాలు, ఐటీ కోర్ టీం సహాయంతో పూసయ్య చెప్పినదంతా అబద్ధమని గుర్తించారు. ఆపై తమదైన శైలిలో విచారించగా నేరాన్ని అంగీకరించాడు. తాను ఎల్ఐసీ పాలసీని రెండు నెలల క్రితం తీసుకున్నానని, పాలసీ ప్రకారం సాధారణ మరణమైతే రూ.20 లక్షలు, ప్రమాద మరణమైతే రూ.40 లక్షల వస్తాయని భావించానన్నాడు. తాను చనిపోయినట్టుగా సమాజాన్ని, ఇన్సూరెన్స్ కంపెనీని నమ్మించి మోసం చేద్దామనే ఉద్దేశ్యంతో ఎవరైనా చనిపోయిన మగ వ్యక్తిని తీసుకు రమ్మని, అలా తీసుకొస్తే.. అది కరెంట్ షాక్ తగిలి చనిపోయినట్టు(యాక్సిడెంట్ డెత్)గా చిత్రీకరించి ఎల్ఐసీ ఇన్సూరెన్స్ పొందవచ్చునని పథకం వేశానన్నాడు.

ఈ మేరకు తన స్నేహితుడైన హుకుంపేటకు చెందిన వందే శ్రీనుకు రూ.10 వేలు ఇచ్చి ఆ పని అప్పగించగా.. శ్రీను శ్మశానాల వద్ద గోతులు తవ్వే హుకుంపేటకు చెందిన తలారి సుబ్బారావు, మోరంపూడికి చెందిన చీర చిన్నిలకు ఆ పని అప్పజెప్పాడు. ఆ ముగ్గురు 25వ తేదీ అర్ధరాత్రి పాత బొమ్మూరు శ్మశానవాటిక నుంచి మగ శవాన్ని దొంగిలించి శ్రీను కారులో ఎక్కించుకొని రంగంపేట మండలం పాత వీరంపాలెంలోని కేతామళ్ళ గంగారావు పొలంలోని ట్రాన్స్‌ఫార్మర్ వద్దకు తీసుకొచ్చారు. అనంతరం నలుగురు కలిసి నిప్పు అంటించినట్టు పూసయ్య చెప్పాడని డీఎస్పీ వివరించారు. అయితే ఆ శవం ఎవరిదో దర్యాప్తు చేసి వారి బంధువులకు పంచనామా చేసి అనంతరం అప్పగించినట్టు పోలీసులు చెప్పారు. ఈ కేసులో పూసయ్యను ఎ1 నిందితుడిగా చేర్చామన్నారు. నిందితులు నలుగురిని ఈ నెల 30న అరెస్ట్ చేసి, రిమాండ్‌కి పంపామని డీఎస్పీ ఎం.కిషోర్‌కుమార్ తెలిపారు. సమావేశంలో అనపర్తి సీఐ శివగణేష్, రంగంపేట ఎస్ఐ పి.విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

'ఆంధ్రజ్యోతి' చొరవతో వృద్ధుడికి వైద్యం



మంగళవారం అర్ధరాత్రి వేళ వృద్ధుడి దుస్థితి



బుధవారం ప్రభుత్వాసుపత్రి వార్డులో చికిత్స పొందుతూ ఇలా

రాజమహేంద్రవరం, జనవరి 31(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వాస్పత్రి వద్ద 57ఏళ్ల వృద్ధుడిని అర్ధరాత్రివేళ చలిలో బయట వదిలేయడంపై 'రాజమహేంద్రవరం ఆసుపత్రి వద్ద చలిలోనే వృద్ధుడు' అనే శీర్షికతో బుధవారం 'ఆంధ్రజ్యోతి' మెయిన్ ఎడిషన్‌లో వార్త ప్రచురితమైన విషయం తెలిసిందే. దీంతో ప్రభుత్వాస్పత్రి సూపరింటెండెంట్ లక్ష్మీ సూర్యప్రభపై కలెక్టర్ మాధవీలత ఫోన్‌లో ఆగ్రహం వ్యక్తంచేశారు. ఆస్పత్రిలో ఏం జరుగుతోందం టూ ప్రశ్నించారు. ఇలాంటి విషయాలు తన దృష్టికి కచ్చితంగా తీసుకురావా లని, వృద్ధుడికి పూర్తి స్థాయి వైద్యం అందించాలని ఆదేశించారు. దీంతో అత డికి మెడికల్ వార్డులో బెడ్ కేటాయించి రక్త పరీక్షలు చేశారు. సెలైన్ పెట్టి మందులు ఇచ్చారు. ఎంఆర్ఐ స్కానింగ్‌కి, కళ్లకు చికిత్స కోసం నేత్ర వైద్యుడికి రిఫర్ చేశారు. చాన్ బాషా అనే యాచకుడు కంటి వైద్యం కోసం నంద్యాల నుంచి తమిళనాడులోని మదురై వెళ్లాడు. ఏడాది యాచించి దాచుకున్న రూ.36 వేలు తన కూడా తీసుకెళ్లాడు. మదురై వెళ్లాక డబ్బులు ఇంకా ఎక్కువ అవసరమని తెలియడంతో అక్కడి వాళ్ల సలహా మేరకు పాండిచ్చేరి వెళ్లడానికి రైలెక్కాడు. రైలులో తనను ముగ్గురు నలుగురు తీవ్రంగా కొట్టి డబ్బులు లాక్కొని ప్లాట్‌ఫాంపై పడేశారని వృద్ధుడు చెప్పాడు. ఎలాగోలా రైలెక్కి రాజ మండ్రిలో దిగిపోయాడు. నెమ్మదిగా జాంపేట మసీదు వద్దకు చేరుకొని బిక్షాటన చేస్తున్నాడు. అయితే, గుర్తు తెలియని వ్యక్తులు రైలులో కొట్టడంతో గాయాలై బాధ పడుతుండడంతో స్థానికులు ఈ నెల 24న రాత్రి 8గంటల ప్రాంతంలో ప్రభుత్వా స్పత్రిలో చేర్చారు. బుధవారం(30న) వైద్యులు డిశ్చార్జి రాయగా అర్ధరాత్రి అత డిని సిబ్బంది వీల్‌చైర్‌లో ఆస్పత్రి నుంచి బయటకు తీసుకొస్తుండగా వీల్‌చైర్ గోతిలో పడడంతో ఇతడు కింద పడిపోయాడు. తనకు వైద్యం చేయకుండా ఎవరి వద్దకు పంపుతున్నారంటూ ప్రశ్నించాడు. విషయం తెలుసుకున్న 'అంధ్ర జ్యోతి' వెళ్లి వివరాలు సేకరించి, వృద్ధుడి పట్ల అర్ధరాత్రి వేళ ఈ తీరు సరికా దని నిలదీయడంతో ఆ వృద్ధుడిని ఆస్పత్రిలోకి తరలించారు. కనీస మానవ త్వం లేకుండా సంబంధీకులు ఎవరూ లేని వృద్ధుడిని అర్ధరాత్రి వేళ ఆస్పత్రి సిబ్బంది ఎక్కడి తరలిస్తున్నారనే ప్రశ్నకు సమాధానం కరువైంది. కాగా.. ఆ వృద్ధుడికి ఇక్కడ ఎవరూ లేకపోవడంతో దుస్తులు దుర్వాసన వస్తున్నాయి. దాతలు ఆదుకోవాలని అతడి దుస్థితి చూసినవారు విజ్ఞప్తి చేస్తున్నారు.

టీడీపీ నాయకుడు రాపాక తిలక్ హఠాన్మరణం



తిలక్ భౌతికకాయం వద్ద నివాళులర్పిస్తున్న జవహర్ తదితరులు

తాళ్లపూడి, జనవరి 31: మండలంలోని మలకపల్లిలో టీడీపీ సీనియర్ నాయకుడు, సర్పంచ్ రాపాక రాజేశ్వరి తనయుడు రాపాక బాల గంగాధర్ తిలక్ బుధవారం హఠాన్మరణం చెందారు. టీడీపీ జిల్లా అధ్యక్షుడు కేఎస్ జవహర్, ద్విసభ్య కమిటీ సభ్యుడు జొన్నగడ్డ సుబ్బరాయచౌదరి తదితరులు తిలక్ భౌతికకాయానికి పార్టీ జెండా కప్పి పూలమాల వేసి నివాళులర్పించారు. తిలక్ మృతి టీడీపీకి తీరని లోటని అన్నారు. కార్యక్రమంలో నాయకులు తిగిరిపల్లి గోపి, ఉప సర్పంచ్ మద్దిపాటి రామారావు, మద్దిపాటి ప్రకాశం తదితరులు నివాళులర్పించారు.

యోగద సత్సంగ వార్షికోత్సవం

రాజమహేంద్రవరం కల్చరల్, జనవరి 31: గెయిల్ ఆఫీస్ సమీపంలోని యోగద సత్సంగ ధ్యాన మందిరంలో 22వ వార్షికోత్సవం ఘనంగా జరిగింది. యోగదా సభ్యులు, భక్తులు సామూహిక ధ్యానంలో పాల్గొని శక్తి పూర్ణ అభ్యాసాలు, ప్రవచనాలు చేశారు. కీర్తనలు ఆలపించారు. అనంతరం ప్రసాద వితరణ జరిగింది. ఒక యోగి ఆత్మకథ రచయిత పరమహంస యోగానంద స్థాపించిన యోగద సత్సంగ సొసైటీ ఆధ్వర్యంలో ఈ వేడుకలు జరిగాయి.

2, 3 తేదీల్లో ఇంటర్ పరీక్షలకు

ఫస్టియర్ విద్యార్థులు తప్పక హాజరవ్వాలి

రాజమహేంద్రవరం, జనవరి 31(ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలు-2024లో భాగంగా ఫిబ్రవరి 2న జరిగే నైతికత-మానవీయ విలువలు, 3న నిర్వహించే పర్యావరణ విద్య పరీక్షలకు మొదటి ఏడాది జనరల్, ఒకేషనల్ విద్యార్థులు తప్పనిసరిగా హాజరు కావాలని ఇంటర్మీడియట్ బోర్డు ప్రాంతీయ పర్యవేక్షకులు ఎన్ఎస్‌వీఎల్ నరశింహం తెలిపారు. ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 1గంటల వరకూ ఈ పరీక్షలు జరుగుతాయని.. వీటిలో ఉత్తీర్ణత సాధించకపోతే ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం ఇంటర్ పాస్ సర్టిఫికెట్ జారీ చేయరన్నారు. అలాగే ఫిబ్రవరి 5 నుంచి 20 వరకూ ఒకేషనల్, 11 నుంచి 20 వరకూ జనరల్ విద్యార్థులకు ప్రాక్టికల్ పరీక్షలు నిర్వహిస్తారన్నారు. విద్యార్థులు తమ బ్యాచ్ తెలుసుకొని పరీక్షలకు హాజరు కావాలని ఆయన సూచించారు.

మార్చి 22 నుంచి వేంకటేశ్వరస్వామి విగ్రహ ప్రతిష్ఠోత్సవాలు



దేవరపల్లి, జనవరి 31: మండలంలోని యర్నగూడెంలో అలివేలు మంగ పద్మావతి సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయ విగ్రహ ప్రతిష్ఠా ఉత్స వాలు మార్చి 22 నుంచి 25వరకు నిర్వహించనున్నట్టు ప్రముఖ సిద్ధాంతి రావిపాటి వెంకటప్రసాద్ తెలిపారు. ఈ మేరకు నూతనంగా నిర్మించిన ఆలయం వద్ద బుధవారం సన్నాహక సమావేశం నిర్వహించారు. వెంకటప్రసాద్ మాట్లాడుతూ దేవరపల్లికి చెందిన పారిశ్రామికవేత్త శ్రీకాకుళపు కాశీవిశ్వనాథం రూ.కోటి 50లక్షల వ్యయంతో టీటీడీ ఆగమ శాస్త్రం ప్రకారం ఆలయం నిర్మించారని, మార్చి 25వ తేదీ ఉదయం 8.21గంటలకు ముహూర్తం నిర్ణయించినట్టు చెప్పారు. సమావేశంలో శ్రీకాకుళపు కాశీవిశ్వనాథం, శ్రీకాకుళపు వెంకట నరసింహారావు, తీగల బలరామయ్య, శ్రీకాకుళపు కాశీకృష్ణ, నూలు శ్రీనివాసు, బాళ్ళ వెంకటేశ్వరరావు, గండే శ్రీనివాస్, కారుమంచి స్వామిజీ పాల్గొన్నారు.

చిరంజీవికి చంటియ్య శుభాకాంక్షలు



కడియం, జనవరి 31: ఇటీవల కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన పద్మవిభూషణ్ అవార్డు గ్రహీత, సినీ నటుడు చిరంజీవిని హైదరాబాదు ఆయన స్వగృహంలో బుధవారం సత్యదేవా నర్సరీ అధినేత పుల్లా చంటియ్య కలిశారు. బర్డ్‌నెస్ట్ ఫెర్న్ అనే మొక్కను ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు. సామాజిక సేవ, సినీ, రాజకీయ రంగాల్లో మచ్చలేని వ్యక్తిగా అందరి ఆదరాభిమానాలు పొందిన చిరంజీవికి పద్మవిభూషణ్ అవార్డును రావడం హర్షణీయమని చంటియ్య అన్నారు.

కార్పొరేషన్‌ల నిధులు ఏమయ్యాయి?

ప్రభుత్వంపై టీడీపీ నాయకులు ఆగ్రహం

గోకవరం, జనవరి 31: వైసీపీ ప్రభుత్వం అధికారం చేపట్టి సుమారు ఐదేళ్లు కావస్తున్నా ఎస్సీ, బీసీ, ఓసీ కార్పొరేషన్‌ల నిధులు ఇంతవరకూ ఏ ఒక్కరికీ మంజూరు చేయలేదని టీడీపీ నాయకులు విమర్శించారు. గోకవరంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాజీ జడ్పీటీసీ పాలూరి బోస్, సొసైటీ చైర్మన్ గాజింగం సత్తిబాబు, టీడీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శి గునుపే భరత్ మాట్లాడుతూ ఎస్సీ నిధులను దుర్వినియోగం చేయకూడదన్న సుప్రీంకోర్టు తీర్పును సీఎం జగన్ పెడ చెవిన పెట్టారన్నారు. అలాగే బీసీ, ఓసీ కార్పొరేషన్ నిధులను కూడా దారి మళ్ళించారని ఆరోపించారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో ఎస్సీ, బీసీ, ఓసీ కార్పొరేషన్ నిధులను ఆయా లబ్ధిదారులకు అందుబాటులో ఉంచారన్నారు. గోకవరంలో స్థలాల కోసం ఎదురుచూస్తున్న లబ్ధిదారులకు వెంటనే స్థలాలను కేటాయించాలన్నారు. లేనిపక్షంలో ఆందోళనకు దిగుతామని హెచ్చరించారు. కోతులు, కుక్కల బెడద నుంచి రక్షించేందుకు సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో పలువురు టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

పల్ల వెంకన్న నర్సరీని

సందర్శించిన సుధానారాయణమూర్తి



సుధా నారాయణమూర్తికి మొక్కను అందజేస్తున్న పల్ల వినయ్

కడియం, జనవరి 31: కడియంలో గ్రీన్ వరల్డ్ ఆవిష్కృతమైందని, అందుకు నర్సరీ రైతుల కృషి ప్రశంసనీయమని ఇన్ఫోసిస్ అధినేత, సంఘ సంస్కర్త సుధా నారాయణమూర్తి అన్నారు. బుధవారం పల్ల వెంకన్న నర్సరీని సందర్శించారు. నర్సరీ డైరెక్టర్ పల్ల వినయ్ మొక్కను అందజేసి స్వాగతించారు. నర్సరీని తిలకించిన సుధానారాయణమూర్తి తాను బెంగుళూరు, కలకత్తా, చెన్నై వంటి నగరాల్లో తిరిగినా గ్రీన్ లోకేషన్ చూడలేదన్నారు. ఆమె వెంట తహసీల్దారు ఎం.సుజాత ఉన్నారు.

యోగద సత్సంగ వార్షికోత్సవం

రాజమహేంద్రవరం కల్చరల్, జనవరి 31: గెయిల్ ఆఫీస్ సమీపంలోని యోగద సత్సంగ ధ్యాన మందిరంలో 22వ వార్షికోత్సవం ఘనంగా జరిగింది. యోగదా సభ్యులు, భక్తులు సామూహిక ధ్యాన కార్యక్రమంలో పాల్గొని శక్తి పూర్ణ అభ్యాసాలు, ప్రవచనాలు చేశారు. కీర్తనలు ఆలపించారు. అనంతరం ప్రసాద వితరణ జరిగింది. ఒక యోగి ఆత్మకథ రచయిత శ్రీశ్రీ పరమహంస యోగానంద స్థాపించిన యోగద సత్సంగ సొసైటీ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఈ వేడుకలు జరిగాయి.

రాక్షస పాలనను అంతమొందించాలి

తెలుగు రైతు జిల్లా అధ్యక్షుడు సిరసపల్లి



మహిళకు సూపర్ సిక్స్ పథకాలను వివరిస్తున్న సిరసపల్లి

అనపర్తి, జనవరి 31: రాష్ట్రంలో కొనసాగుతున్న రాక్షస పాలనను అంతమొందించేందుకు ప్రజలు చైతన్య వంతులు కావాలని తెలుగు రైతు జిల్లా అధ్యక్షుడు సిరసపల్లి నాగేశ్వరరావు అన్నారు. బుధవారం మండలంలోని దుప్పలపూడిలో నిర్వహించిన బాబు ష్యూరిటీ-భవిష్యత్ గ్యారెంటీ కార్యక్రమంలో రెండో కూడా ఇంటింటికీ ప్రచారం నిర్వహించారు. మినీ మేనిఫెస్టోలోని అంశాలను వివరించి, ప్రజల సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ధరలతో జీవనం అస్తవ్యస్తంగా మారిందని, జగన్‌రెడ్డి పాలనపై ప్రజలు విరక్తితో ఉన్నారన్నారు. కార్యక్రమంలో చిర్ల గంగిరెడ్డి, నల్లమిల్లి వెంకటరెడ్డి, కుంత్సం కాశీవిశ్వేశ్వరరావు, మరకుర్తి అమ్మిరాజు, వల్లభశెట్టి శ్రీను, పెద్దింటి సత్తిబాబు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు అంకిత ఎంపిక



పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థినులతో హెచ్‌ఎం

అనపర్తి, జనవరి 31: ఇటీవల కాకినాడలో నిర్వహించిన స్కూల్ గేమ్స్ టెన్నీకాయిట్ జిల్లా ఎంపికల్లో పాల్గొని తమ విద్యార్థిని రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్టు అనపర్తి జడ్పీ బాలికోన్నత పాఠశాల హెచ్‌ఎం కర్రి కళ్యాణి తెలిపారు. రాష్ట్ర స్థాయికి ఎంపికైన ఎనిమిదో తరగతి విద్యార్థిని బి.అంకిత ఈనెల 3నుంచి 5వరకు ఏలూరు జిల్లా జంగారెడ్డిగూడెంలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొనునుందని చెప్పారు. అలాగే ఇటీవల విజయవాడలో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో పదో తరగతి విద్యార్థిని ఎన్.శిరీషా మంగాదేవి విశేష ప్రతిభ కనబరిచి కప్పు సాధించినట్టు హెచ్‌ఎం తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థినులను, పీఈటీ ఎ.రాజేశ్వరిని ఆమె అభినందించారు.

సినిమా గైడ్

కొవ్వూరు	
యువరాజీమాల్ వై.స్క్రీన్ 1	గుంటూరుకారం
వై.స్క్రీన్ 2	సైంధవ్
దేవిశ్రీ(గాయత్రి)	నా సామి రంగ
అనన్య	గుంటూరు కారం
నిడదవోలు	
వీ మ్యాక్స్	గుంటూరు కారం
రాధాకృష్ణ	హనుమాన్
శ్రీగణపతి	సైంధవ్
దేవరపల్లి	
శ్రీరామ్ సినీ మ్యాక్స్	గుంటూరు కారం
శ్రీరామ్ సినీ మ్యాక్స్	గుంటూరు కారం
నల్లజర్ల	
శ్రీలక్ష్మి మల్టీప్లెక్స్	సలార్
శ్రీనివాస	సలార్